ప్రపంచ టెన్నిస్ మాస్టర్స్ క్రీడలో బొబ్బిలి యువరాజు రామ్ నాయన ప్రతిభ

విశాలాంధ్ర-బొబ్బిలి:టీడీపీ మాజీ మంత్రి ఆర్వి సుజీకృష్ణ రంగారావు బ్రదర్ ఆర్.వి.ఆర్. కె.రంగా రావు (రామునాయన) ఈనెల 13 నుండి 19 వరకు డార్జిలింగ్ గైమిఖాన్‌క్లబ్‌లో జరిగిన ప్రపంచ టెన్నిస్ మాస్టరస్ ఎంటీ 200 (2023) సింగల్ మరియు డబల్ ఛాంపియన్(50+) పోటీలలో ప్రధమ స్థానములు సాధించారు. ప్రతిభ కనబరిచిన రామునాయన టెన్నిస్ క్రీడలో వీరి తండ్రి వద్ద లాన్ టెన్నిస్ లో మెళుకువలు తెలుసుకొని సాధన చేసి విజయం సాధించినట్లు విలేకరులకు తెలిపారు. ప్రపంచ స్థాయిలో టెన్నిస్ క్రీడలో ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించి ప్రపంచ పటములో బొబ్బిలికి ప్రత్యేకమైన స్థానం కల్పించిన రామ్ నాయన కు పట్టణ ప్రజలు. క్రీడాకారులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

రక్తదాతల స్పందన అభినందనీయం

విశాలాంధ్ర-విజయనగరం క్రైమ్: రక్తదాతల స్పందన అభినందనీయమని జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి కె.దయానంద్ అన్నారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత, గాయత్రీ విద్యాసంస్థల డైరెక్టర్ పతివాడ సత్యనారాయణ, వారి కుమారుడు సందీప్ ల 5వ వర్ధంతి సందర్భంగా అబ్దుల్ కలాం బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక న్యూ లైఫ్ బ్లడ్ సెంటర్ నందు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దయానంద్ మాట్లాడుతూ వేసవిలో రక్తం కొరత లేకుండా చేసేందుకు నిర్వాహకులు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. అత్యవసర సమయంలో రక్తం అందకుండా ఎవరూ ప్రాణాలు కోల్పోయే పరిస్థితి వుండకూడదని, రక్తదానం ప్రాణధానం అని అన్నారు. అనంతరం రక్తదాతలను అభినందిస్తూ సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్నిపల్లి సింహాచలం నాయుడు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఎండవేడి దృష్ట్యా ఉపాధి వేతనదారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి : ఎమ్మెల్సీ రఘురాజు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : ఎస్.కోట మండలం బొడ్డవర పంచాయితీ మరుపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ చెరువు పనులను ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భముగా ఎమ్మెల్సీ చెరువు పనులు జరుగుతున్న తీరును, ఉపాధిహామీ కూలీల హాజరు, వారికి కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండవేడి, వడగాల్పుల నుండి రక్షణ పొందుతూ తగు జాగ్రత్త లను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్.కోట ఎం.పి.పి సండి సోమేశ్వరరావు, స్థానిక నాయకులు మురళీరాజు, దేముడు, సుంకరి బుల్లి తదితరులు పాల్గొన్నారు.

మహిళ అస్వస్థత సంఘటనపై స్పందన

విశాలాంధ్ర కథనానికి స్పందించిన యంత్రాంగం



విశాలాంధ్ర-తెర్లాం/బాడంగి: బాడంగి మండలంలో కోడూరు గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలు తెలకలబంధ చెరువులో గురువారం ఒక మహిళ అస్వస్థత గురైన సంఘటన విశాలాంధ్ర పత్రికలో వచ్చిన కథనాలకు స్పందించి అక్కడ పనిచేసిన కూలీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బాడంగి ఏపిఓ లక్ష్మి పతిరాజు పరిశీలించి పని చేసేటప్పుడు వేతనదారులకు ఎటువంటి వడదెబ్బ తగలకుండా టెంటులు ఏర్పాటుచేస్తామని, పనిచేసేటప్పుడు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా కింద స్థాయి సిబ్బంది తో అవగాహన కల్పించి ఇంకొకసారి ఇటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపడతామని అన్నారు.అలాగే గురువారం వడదెబ్బ కు సొమ్మసిల్లిన మహిళ ఆరోగ్యం బాగుంది అని ఎటువంటి ఇబ్బంది లేదని ఏపిఓ విలేకరితో తెలిపారు.

మీ వల్లే... మేం ధైర్యంగా ప్రజల్లోకి వెళ్తున్నాం.... : డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

వాలంటీర్ సేవలు చరిత్రాత్మకం : కలెక్టర్ నాగలక్ష్మి

విశాలాంధ్ర-విజయనగరం: పేదవానికి కష్టం వస్తే వారి కుటుంభ సభ్యుల కన్నా ముందే వాలంటీర్ కు ఫోన్ చేస్తున్నారని, పేద కుటుంబాలను సొంత మనుషుల్లా భావిస్తూ అలుపెరగని సేవలు అందిస్తున్నారని ఉప సభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి పేర్కొన్నారు. వాలంటీర్లు అంత గొప్ప సేవలు అందిస్తున్నారు కనుకనే ప్రజా ప్రతినిదులమైన తాము ప్రజల్లో ధైర్యంగా తిరగగలుగుతున్నామని అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియం లో వాలంటీర్లకు సేవామిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురష్కారాలను అందజేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ఉప సభాపతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆశయాలను నిజం చేసే సైనికులే వాలంటీర్లని అన్నారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాలూ మన వాలంటీర్ వ్యవస్థ వైపేచూస్తున్నాయని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోనికి సమర్ధవంతంగా తీసుకువెళ్ళడంలో వారి పాత్ర అభినందనీయమని అన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య చక్కటి వారధులుగా నిలుస్తు పారదర్శకంగా పథకాలను అందిస్తున్నారని కొనియాడారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో, వార్డులలో వారికీ కేటాయించిన కుటుంబాలను స్వంత కుటుంభ సభ్యులుగా భావిస్తూ ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకాన్నీ అందేలా పనిచేసే వాలంటీర్ల సేవలు చారిత్రాత్మకం అని అన్నారు. నవరత్నాలు అందించడం, ఈకేవైసి చేయడం, సిటిజెన్ అవుట్ రీచ్‌లో, డ్రాపఔట్స్ సర్వే, తదితర విధులను తప్పులు లేకుండా చేయడం అభినందనీయం అన్నారు. కోవిడ్‌లో ఫీవర్ సర్వే చేయడమే కాకుండా వాక్సినేషన్, ఇంటింటికి మందుల పంపిణీ, రేషన్ పంపిణీ లో వారి సేవలు వేల కట్టలేనివని పేర్కొన్నారు.

సేవామిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురష్కారాల అందజేత

2023 సంవత్సరానికి గాను 9997 మంది గ్రామ వాలంటీర్లకు, 10 కోట్ల 22 లక్షల 90వేల రూపాయలను ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వాలంటీర్ల ఖాతాలకు ఎంటిఆర్. జిల్లాలో జరిగిన సభ నుండి బటన్ నొక్కి జమ చేసారు. వీరిలో జిల్లాకు చెందిన సేవా వజ్ర 36 మందికి గానూ 10,80,000 రూపాయలను , సేవా రత్న కింద 160 మందికి గానూ 32,00,000 రూపాయలు, సేవా మిత్ర 9801 మందికి 9,80,000 రూపాయలను వారి ఖాతాలకు జమచేసారు. సమావేశం అనంతరం డిప్యూటీ స్పీకర్, జెడ్పీ చైర్మన్, కలెక్టర్ చేతుల మీదుగా మెగా వాలంటీర్లకు చెక్కును అందజేశారు. సేవా వజ్ర, సేవా రత్న పురస్కారాలు పొందిన వారికీ శాలువా, సర్టిఫికేట్, మెడల్‌ను బహుకరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు డా. సురేష్ బాబు, ఇందుకూరి రఘురాజు, శాసన సభ్యులు కంబాల జోగులు, శంబంగి వెంకట చిన్న అప్పలనాయుడు, నగర మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, పలు వురు ఎంపిపిలు, జెడ్‌పిటిసి లు, సర్పంచ్‌లు, సచివా లయ స్పెషల్ అధికారి నిర్మలా దేవి, డిపిఓ శ్రీధర్ రాజు, జిల్లా పరిషత్ సి.ఈ.ఓ డా. అశోక్ కుమార్, జిల్లా కో ఆర్డినేటర్ అశోక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం కలెక్టరేట్ పోర్టికో వద్ద జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు తానూ ముఖ్యమంత్రి గా ఉన్నపుడు ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేసారని ఎద్దేవా చేసారు. ట్రైబల్ యూనివర్సిటీ తానే పెట్టానని కబుర్లు చెబుతున్నారు. దేశం లో ఎక్కడైనా గిరిజన ప్రజ్నల్లోనే గిరిజన యూనివర్సిటీ లు ఉన్నాయని, ఈయన గిరిజనులకు దూరంగా, రియల్ ఎస్టేట్ కు దగ్గరగా ఉండే కొత్తవలస లో ప్రతిపాదించారని అన్నారు. మెడికల్ కాలేజీ, భోగాపురం ఎయిర్ పోర్ట్, గురజాడ యూనివర్సిటీ లను ఈ ప్రభుత్వమే తీసుకువచ్చిందని అన్నారు. తారకరామా తీర్ధ సాగరానికి అభివృద్ధి చేసింది మేమే నని, మీ హయం లో ఖర్చు చేసి ఉంటె శ్వేతా పత్రాన్ని విడుదల చేయాలని అన్నారు. పెందుర్తి నుండి అరకు వరకు 4 లైన్ల రహదారిని వేసి రాష్ట్ర హైవే గా ఉన్న రహదారిని నేషనల్ హైవే గా మార్చిన ఘనత మాదేనని అన్నారు. పేదల పక్షాన మీరు లేరని, పెద్దల పక్షాన ఉన్నారని, అధికార దాహం తో ఉన్న చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో పరాభవం తప్పదని అన్నారు.

గడపగడపకు...లో డిప్యూటీ స్పీకర్ సమస్యలపై ఆరా

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: నగరం లోని 30వ డివిజన్ ధర్మపురి బీసీ కాలనీలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాల అమలుతీరును వివరిస్తూనే లబ్ధిదారుల వివరాలతో కూడిన బుక్లెట్లను అందజేశారు. స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికి వెళుతుంటే ప్రజల స్పందన అనూహ్యంగా ఉందన్నారు. స్థానిక కార్పొరేటర్ పతివాడ గణపతిరావు మాట్లాడుతూ తమ డివిజన్లో ఏడవ రోజు గడపగడపకు మన ప్రభుత్వం జరుగుతోందన్నారు. ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నెరవేర్చడం వల్లనే ప్రజలలో ఇంతటి అభిమానం వ్యక్తం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, జోనల్ ఇన్చార్జిలు మారెం బాల బ్రహ్మారెడ్డి, బొద్దాన అప్పారావు, డివిజన్ ఇంచార్జ్ పూసర్ల శ్రీనివాస రావు, మహిళా అధ్యక్షు రాలు చందక ఆదిలక్ష్మి, యువజన అధ్యక్షుడు జయరాం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కేంద్ర కార్యాలయానికి 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' ఫార్మ్‌లు

విశాలాంధ్ర-డెంకాడ/ భోగాపురం: నెల్లిమర్ల నియోజక`వర్గానికి చెందిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి ఫార్మ్ లను వాహనంలో ఉంచి వాహనానికి జెండా ఊపి ప్రారంభించారు. శుక్రవారం విజయనగరం పార్లమెంట్ కార్యాలయానికి పంపుతున్న నియోజకవర్గ టిడిపి ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా నెల్లిమర్ల నియోజక వర్గానికి చెందిన ఫార్మ్ లను ఇంచార్జ్, క్లస్టర్, యూనిట్ ఇంచార్జ్ లు ఇంటింటికి పర్యటించగా ప్రజలు తమ సమస్యలను ఫార్మ్‌లలో నింపి ఇచ్చారు టీడీపీ అధికారంలోకి రాగానే చంద్రబాబునాయుడు ఈ సమస్యలను పరిష్కరిస్తారన్నారు. నెల్లిమర్ల నియోజకవర్గానికి చెందిన ఫార్మ్‌లను టీడీపీ కేంద్ర కార్యాలయానికి పంపిస్తారన్నారు. కార్యక్రమంలో నెల్లిమర్ల మండల పార్టీ అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, పార్లమెంట్ అధికార ప్రతినిధి గేదెల రాజారావు, పార్లమెంట్ స్పోక్స్ పర్సన్ లంక అప్పలనాయుడు, క్లస్టర్ ఇంఛార్జి, తోటరావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు చీపురుపల్లి విద్యార్థులు

విశాలాంధ్ర- చీపురుపల్లి: అండర్19 స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి ఖోఖో కబడ్డీ పోటీలకి ఎంపికైన శ్రీగాయత్రీ జూనియర్ కాలేజ్ విద్యార్థులు ఈ నెల 20, 21, 22న రాజీవ్ స్టేడియంలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు ఖోఖోలో నిద్దాన ఇంద్రావతి, బెవర ధనుష్, కబడ్డీలో మజ్జి హరి, యెజ్జిపురపు స్వాతి ఎంపికై విజయ నగరంలో ఆడనున్నారు, విద్యార్థులను సెక్రటరీ & ప్రిన్సిపాల్ శ్రీ దాసరి శివ ప్రసాదరావు, ఏఓ కె.రాజు, పీఈటీ బి శ్రీను, అధ్యాపకులు అభినందించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ఎమ్మెల్సీ సురేష్ బాబు, ఎంపీపీ పొట్నూరు ప్రమీల

విశాలాంధ్ర-గుర్ల: రోగికి రక్తం అత్యవస రమైన పరిస్థితి లో రోగితోపాటుగా వారి కుటుంబ సభ్యులు రక్తం సేకరణకు చాలా అవస్థలు పడుతున్నారని అటువంటి పరిస్థితిలో రక్తం ఇచ్చిన దాతలు ప్రాణదాత లతో సమానమని ఎమ్మెల్సీ పి.వి.వి.సూర్య నారాయణ రాజు, గుర్ల ఎంపిపి పొట్నూరు ప్రమీల అన్నారు శుక్రవారం శ్రీలక్ష్మి బాలాజీ నర్సింగ్ హోమ్ లో బూర్లే పైడి నాయుడు పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటుచేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఆయన, లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి సంయుక్తంగా ప్రారంభించారు ఈ సందర్భంగా ఎంపీపీ పొట్నూరు ప్రమీల మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యువత పైడినాయుడు పుట్టినరోజు సందర్భంగా రక్త దాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం తనకి చాలా ఆనందంగా ఉందని జిల్లాలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు కి మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి ఇప్పలవలస గోపాలరావు, ఎన్.వి.ఎన్.బ్లడ్ బ్యాంక్ అధినేత నాగేశ్వరరావు చాలా కృషి చేస్తున్నారని అన్నారు,రక్తదాన అవసరం పెరిగిందని ప్రజలు దీనిని గమనించాలని ఆమె అన్నారు మరో అతిధి భీశెట్టి బాబ్జి మాట్లాడుతూ తప్పనిసరిగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చెయ్యాలని, ప్రజలు కూడా రక్త దానం కి సిద్ధపడాలని కోరారు, శిబిరంలో ఇప్పలవలస గోపాలరావు, ఎన్.వి.ఎన్.నాగేశ్వరరావు, నర్సింగ్ హోమ్ అధినేత అల్తి రమణ,సిబ్బంది, రామకృష్ణ మాస్టారు పైడి నాయుడు,యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు.

మామిడి ఎగుమతులపై మరింత దృష్టి సారించాలి

మామిడి కలెక్షన్ సెంటర్‌ను పరిశీలించిన జెసి మయూర్ అశోక్

విశాలాంధ్ర-జామి: మామిడి ఎగుమతులకు పేరు సాదించిన జామి మండలంలోని మామిడి రైతులకు ప్రభుత్వ పరంగా ప్రోత్సాహాన్ని అందించడం జరుగుతోందని, మరింత ఎగుమతులు వృద్ధి చెందేలా రైతులు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సూచించారు. శుక్రవారం జామిమండలం లో పర్యటించిన జెసి ముందుగా అన్నంరాజుపేటలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని తనిఖీచేసారు. అనంతరం ఉద్యానశాఖ ఆర్థిక సహాయంతో అలమండ సంతలో ఏర్పాటుచేసిన మామిడి కలెక్షన్ సెంటర్‌ను సందర్శించారు. ఈసెంటర్‌ను ఏర్పాటుచేసేందుకు ఉద్యానశాఖ ద్వారా 75శాతం రాయితీపై 15లక్షలను ఇవ్వడం జరిగిందని జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎవిఎస్‌వి జమ దగ్ని వివరించారు. ఇక్కడనుంచి కలకత్తా, వారణాశి, రాయపూర్, ఢిల్లీ, తదితర ప్రాంతాలకు మామిడి ఎటుమతి చేస్తున్నట్లు రైతులు తెలిపారు. మామిడి పంటపై దృష్టిసారించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలను జెసి సూచించారు. అనంతరం అలమండలో మామిడి తాండ్ర నిల్వ చేసే కోల్డ్ స్టోరేజీ యూనిట్‌ను పరిశీలించారు. అనంతరం ఐకెపి ఆధ్వర్యంలో జామిలో మంజూరు చేసిన ఐస్‌క్రీం ప్లాంట్‌ను సందర్శించారు. 35శాతం రాయితీపై పిఎంఎఫ్ఎంఇ పథకంలో రూ.7.50లక్షలను మంజూరు చేయడం జరిగిందని వెలుగు ఎపిఎం మధుమహేష్ వివరించారు. అలాగే పాతభీమసింగిలో కంప్యూటర్ ఎంబ్రాయిడరీ మిషన్ సెంటర్‌ను సందర్శించారు. కార్యక్రమంలో జెసితోపాటు తహశీల్దార్ జి. హేమంత్‌కుమార్, ఎవో పి. కిరణ్‌కుమార్, ఉద్యానఅధికారి టి. అనిత, స్థానిక సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

SOUTH INDIAN Bank

డోర్ నం.27-14-1, వార్డ్ నం.16, స్నేహ ఆర్కేడ్, దాసన్నపేట, విజయనగరం, ఏపీ-535002. ఇమెయిల్ ఐడి-br0991@sib.co.in

బ్యాంకులో తనఖాపెట్టిన బంగారు ఆభరణాల వేలం

బ్యాంకు నుంచి పొందిన బంగారు రుణాలు చెల్లించవలసిందిగా పిలుపునిస్తూ ఈ కింద పేర్కొన్న రుణగ్రహీతలకు సౌత్ ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్ అధీకృత అధికారి విక్రయ నోటీసు(లు) జారీ చేయడమైనది. రుణ మొత్తాలను చెల్లించడంలో రుణగ్రహీతలు విఫలమైనందున ఖాతాల్లో ఉన్న బంగారు ఆభరణాలను "ఉన్నది ఉన్నట్లు ప్రాతిపదిక" & "ఏమి ఉంటే అది ప్రాతిపదిక" & "రికోర్స్ లేని ప్రాతిపదిక" పై దిగువ సంతకందారు ఆన్‌లైన్ వేలం నిర్వహిస్తున్నట్లు ఇందుమూలంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు తెలియజేయడమైనది. కింద పేర్కొన్న విధంగా రుణగ్రహీత ఎకౌంట్ నంబర్ల కొరకు తేదీ :29-05-2023 మ॥12:00 గం.నుండి మ॥03:00 గం.ల వరకు https://egold.auctiontiger.net ద్వారా ఆన్‌లైన్‌లో వేలం నిర్వహించబడును.

క్ర. సం.	బంగారు రుణ ఖాతా నం.	పేరు	తనాఖా పెట్టిన తేదీ	తనఖాబంగారం బరువు (మొత్తం బరువు గ్రాముల్లో)	బంగారు రుణం మొత్తం
1	099165300001646	దేవు ఆనంద్	27-09-2022	11.36	38,000
2	099165300002278	పెంటమాని రమేష్	14-09-2022	21.6	74,000
3	099165300002290	పెంటమాని రమేష్	19-09-2022	5.28	16,000
4	099165300002308	పెంటమాని రమేష్	26-09-2022	23.86	83,000
5	099165300002315	పెంటమాని రమేష్	27-09-2022	21.8	74,000
6	099165300002330	పెంటమాని రమేష్	01-10-2022	19.63	68,000
7	099165300002360	దేవు ఆనంద్	12-10-2022	38.34	1,30,000

మరింత సమాచారం కొరకు దయచేసి ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెక్నాలజీస్ లిమిటెడ్ (ఆక్షన్‌టైగర్)ను 6359575981/9023724780 పై సంప్రదించగలరు.

సం/- మేనేజర్, ది సౌత్ ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్

గుమ్మిడి గెడ్డపై వంతెన నిర్మించాలి

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జీవన్ డిమాండ్

విశాలాంధ్ర-కొమరాడ: మండలంలో నాగవల్లి ఆవల ఉన్న గుమ్మిడి గడ్డపై వంతిని నిర్మించి శుక్రవారం గుమ్మిడి గడ్డ సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి టి జీవన్ పరిశీలించారు. ఈ సందర్భంగా జీవన్ పత్రిక విలేకరులతో మాట్లాడుతూ నాగవల్లి ఆవల ఉన్న గుమ్మిడి గడ్డ వంచిన తక్షణమే నిర్మాణం చేయాలంటూ డిమాండ్ చేశారు అలాగే గిరిజన గ్రామాలైన ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోటజీవన్న డిమాండ్ చేశారు. గుమ్మిడి గెడ్డ వంతెన నిర్మించిని ప్రదేశాన్ని తోట జీవన్న, గరుగు గు బిల్లి సూరయ్య , కొమరాడ మండలంలో పాలెం పంచాయతీ, పాలెం, కుంబికోట, రావికోన, గొందిలావ గ్రామాల ప్రజలు రోడ్డు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు, ఈ గ్రామాల నుంచి గర్భిణీ స్త్రీలను అత్యవసర చికిత్స కోసంతరలించాలంటే డోలీ తప్ప మరో దారి లేదన్నారు, డోలిలో కొన్ని కిలోమీటర్లు తీసుకువచ్చి 108 వాహనానికి ఎక్కించడం జరుగుతుందన్నారు, అలాగే ఇతర ప్రజానీకం కూడా ప్రాథమిక ఆరోగ్య సౌకర్యాలు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు, ఇదే గ్రామాల్లో కర్లగండ గ్రామానికి వర్షాకాలం వస్తే గడ్డ దాటి రాలేరు, ఈ ఏడాది వ్యాసవికాలం పోయి వర్షాకాల వస్తున్నందున ఆయా గ్రామ ప్రజలందరూ కూడా ఆందోళన చెందుతున్నారని అన్నారు, ఈ గ్రామాల ప్రజలందరూ ఇప్పటికే ప్రజాప్రతినిధుల్ని అనేకసార్లు ఉమ్మిడి గడ్డపై నిర్మించాలని వినతపత్రాలు ద్వారా వేడుకోవడం జరిగిందన్నారు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు ఆయా గ్రామాల ప్రజల ఆవేదనను పరిగణలో తీసుకోలేదన్నారు, ఆయా ప్రజల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారు అన్నారు గుమ్మిడి గెడ్డపై వంతెనను యుద్ధ ప్రాతిపదికపై నిర్మించి, ఆయా గ్రామాల్లో వైద్య మరియు ఇతర సౌకర్యాలు అందుబాటులోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు, గుమ్మిడి గెడ్డపై వంతెన నిర్మించాలని డిమాండ్ తో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో దశలవారీ ఉద్యమం నిర్మిస్తామని తెలిపారు, ఈ బృందంలో సిపిఐ పార్టీ జిల్లా సమితి సభ్యులు పువ్వల ప్రసాదు ,మండంగి సింగన్న పత్తిక మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

పెదంకలంసచివాలయం నుండి ఇద్దరు వాలంటీర్లకు సేవావజ్ర పురస్కారం

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని పెదంకలం సచివాలయంలో పెదంకలం, సుమిత్రపురం గ్రామపంచాయతీలకు చెందిన ఇద్దరు వాలంటీర్లకు సేవావజ్ర పురస్కారాలు లభించాయి. సేవావజ్ర క్రింద 30వేల రూపాయల నగదు, శాలువాతో సత్కారం, ప్రశంసాపత్రాలను శుక్రవారం జిల్లా కలెక్టరు కార్యాలయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర, జిల్లా కలెక్టరు నిషాంత్ కుమార్ , ఎమ్మెల్యే జోగారావు చేతుల మీదుగా వారు అందుకున్నారు.మండలం నుండి సేవా వజ్ర సత్కారం పొందిన వారిద్దరు వాలంటీర్లను ఎంపిపి బలగ రవణమ్మ, జడ్పీటీసీ మామిడి బాబ్జి, మండల వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు బొంగు చిట్టిరాజు, ఎంపిడిఓ ప్రసాద్, ఈఓపిఆర్డి వర్మ,ఆయా గ్రామాలకు చెందిన సర్పంచులు బలగ శ్రీనివాసరావు,ఉమా మహేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు కె. గౌరీశ్వరి, ఆర్ సోమేశ్వ రరావు,సచివాలయం సిబ్బంది, తోటివాలంటీర్లు అభినందించారు.

జిల్లాలో 4742 మంది వాలంటీర్లకు సేవా పురస్కారాలు : మంత్రి రాజన్నదొర

విశాలాంధ్ర-పార్వతీపురం: జిల్లాలో 4742 మంది వాలంటీర్లు సేవా పురస్కారాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేసిన నేపథ్యంలో వారిలో 19మంది సేవా వజ్ర పురస్కారాలను మంత్రి రాజన్నదొర, జిల్లా కలెక్టరు నిషాంత్ కుమార్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చేతుల మీదుగా శుక్రవారం అందజేసారు .వాలంటీర్లకు వందనం కార్యక్రమం శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్న దొర, జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, శాసన మండలి సభ్యులు పాలవలస విక్రాంత్, శాసన సభ్యులు అలజంగి జోగారావు, విశ్వసరాయి కళావతి పాల్గొని పురస్కారాలను ప్రదానం చేశారు. జిల్లాలో 312 గ్రామ, 38వార్డు సచివాలయాలు కలిపి 350 ఉన్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న 4030 మందికి సేవామిత్ర, 75 మందికి సేవారత్న, 17 మందికి సేవా వజ్ర పురస్కారాలు లభించాయన్నారు. పట్టణ ప్రాంతాల్లో పనిచేస్తున్న 603 మందికి సేవా మిత్ర, 15 మందికి సేవారత్న, ఇద్దరికి సేవావజ్ర పురస్కారాలు లభించాయని చెప్పారు. కురుపాం నియోజక వర్గంలో కొమరాడ మండలంలో220 మందికి సేవా మిత్ర, 5 మందికి సేవారత్న, ఇద్దరికి సేవా వజ్రలు,గుమ్మలక్ష్మీపురం మండలంలో 291 మందికి సేవామిత్ర, 5మందికి సేవారత్న, ఒకరికి సేవావజ్ర,కురుపాం మండలంలో 236 మందికి సేవామిత్ర, 5మందికి సేవారత్న, జియ్యమ్మవలస మండలంలో 251 మందికి సేవామిత్ర,5మందికి సేవారత్న, ఇద్దరికి సేవా వజ్రలు, గరుగుబిల్లి మండలంలో225 మందికి సేవామిత్ర, 5మందికి సేవారత్న పురస్కారాలు లభించాయన్నారు. పాలకొండ నియోజక వర్గంలో వీరఘట్టం మండలంలో 373మందికి సేవామిత్ర, 5మందికి సేవారత్న, ఒకరికి సేవావజ్ర, సీతంపేట మండలంలో 317 మందికి సేవామిత్ర, 5 మందికి సేవారత్న, ఒకరికి సేవా వజ్ర,భామిని మండలంలో 222 మందికి సేవామిత్ర, 5మందికి సేవారత్న పురస్కారాలు, పాలకొండ మండలంలో 244 మందికి సేవామిత్ర, 5మందికి సేవా రత్న, ఇద్దరికి సేవావజ్ర ,పాలకొండ పట్టణంలో 138 మందికి సేవామిత్ర, 5మందికి సేవారత్న, ఒకరికి సేవావజ్ర పురస్కారాలు లభించాయన్నారు. పార్వతీపురం నియోజక వర్గంలో పార్వతీపురం మండలంలో 318 మందికి సేవామిత్ర, 5 మందికి సేవారత్న,సీతానగరం మండలంలో292 మందికి సేవామిత్ర, 5 మందికి సేవారత్న, ఇద్దరికి సేవావజ్ర,బలిజిపేట మండలంలో 353 మందికి సేవామిత్ర, 5 మందికి సేవా రత్న, ఇద్దరికి సేవావజ్ర,పార్వతీపురం పట్టణంలో 238 మందికి సేవామిత్ర,5మందికి సేవారత్న, ఒకరికి సేవావజ్ర పురస్కారాలు లభించాయన్నారు. సాలూరు నియోజకవర్గంలో మక్కువ మండలంలో 287 మందికి సేవామిత్ర,5మందికి సేవారత్న, ఇద్దరికి సేవావజ్ర, సాలూరు మండలంలో186 మందికి సేవా మిత్ర, 5 మందికి సేవారత్న, ఇద్దరికి సేవా వజ్ర, పాచిపెంట మండలంలో 215 మందికి సేవామిత్ర, 5మందికి సేవారత్న,సాలూరు పట్టణంలో 227మందికి సేవామిత్ర, 5మందికి సేవారత్న పురస్కారాలు లభించాయన్నారు. ఈసందర్భంగా ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర మాట్లాడుతూ ప్రజలకు నేరుగా సంక్షేమ పథకాలు అందించుటకు వాలంటీర్ల వ్యవస్థ ముఖ్యమంత్రి ఏర్పాటు చేశారని అన్నారు. పరిపాలన పకడ్బందీగా క్షేత్ర స్థాయిలో చేరుటకు చక్కని వ్యవస్థ అని చెప్పారు. అవినీతి లేని, పారదర్శకంగా పథకాలు చేర్చుతున్నారని ఆయన కొనియాడారు. శాసనసభ్యులు అలజంగి జోగారావు మాట్లాడుతూ ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించుటకు వాలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఏర్పాటు చేశారని ఆయన అన్నారు. కలెక్టర్ నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా వాలంటీర్ వ్యవస్థ ఏర్పాటుజరిగిందన్నారు. దీనిపై అధ్యయనం జరిగే స్థాయికి ఎదిగిందన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మంచి వారధిగా పనిచేస్తూ ప్రభుత్వానికి కళ్ళు, చెవులుగా పనిచేస్తున్నారని వివరించారు. ప్రభుత్వ కార్యక్రమాలు క్షణాల్లో చేరుటకు, సమాచారం చేరవేయడానికి వ్యవస్థ చక్కగా పనిచేస్తుందని అన్నారు. ఈకార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ బి. గౌరీశ్వరి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్,సచివాలయాల నోడల్ అధికారి కె. రామచంద్రరావు, మునిసిపల్ కమీషనర్ జె.రామఅప్పలనాయుడు, పార్వతీపురం నియోజకవర్గం లోని మూడు మండలాల ప్రజాప్రతినిధులు, పురపాలక సంఘం ప్రజాప్రతినిదులు, అధికారులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ సమాజ సేవకులు మృత్యుంజయరావు మృతి

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: పట్టణానికి చెందిన ప్రముఖ సమాజ సేవకులు దాలి మృత్యుంజయరావు మృతి చెందారు. ఈయన పార్వతీపురం పట్టణంలో జన్మించి ప్రముఖ పారిశ్రామికవేత్తగా హైదరాబాదులో స్థిరపడ్డారు. మృత్యుంజయరావు సొంత ఊరు మీద ఉన్న అభిమానంతో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేపీఎం స్కూలు, డి వి ఎం ఎం స్కూలు ,గవర్నమెంట్ గర్ల్స్ హై స్కూల్, ఎస్విడి కళాశాల అభివృద్ధికి ఎంతగానో సహకరించారు. వారి అమ్మ గారి జ్ఞాపకార్థం ఒక పెద్ద లైబ్రరీ ,కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్, మహిళలకు కుట్టు మిషన్ ట్రైనింగ్ సెంటర్, యోగ ఉచితంగా స్థాపించి అనేక విధాలుగా పేద విద్యార్థులకు ,ప్రజలకు సహాయం చేశారు. అనేక విద్యాసంస్థల్లో పలు సేవా కార్యక్రమాలతో పాటు పలు భవన నిర్మాణాలు చేపట్టారు. మృత్యుంజయరావు మరణ వార్త విన్న పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారాలు, ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు మృత్యుంజయరావు లేని లోటు తీరనిదని, ఆయన అందరి మనసుల్లో స్మృతి చిహ్నంగా నిలిచిపోతారని అభివర్ణించారు.

నవధాన్య విత్తనాల కిట్లు పంపిణీ



విశాలాంధ్ర-మక్కువ : మక్కువ మండలం చప్పబుచ్చింపేట రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం నవధాన్య విత్తనాలు కిట్లు పంపిణీ చేశారు. "నవధాన్యాలు సాగు నేలతల్లికి బాగు" అనే కార్యక్రమంలో భాగంగా ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రబంధకులు షణ్ముఖరాజు, అదనపు జిల్లా ప్రబంధకులు ధనుంజయ రావు సూచనల మేరకు మక్కువ యూనిట్ ఇంచార్జిలు నలితం గంగరాజు, ఉర్లక నాగార్జున పొలంబడి రైతులకు నవధాన్య విత్తనాల కిట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ నవధాన్యాలు సాగు చేయడం వల్ల భూమిలో జీవవైవిధ్యం పెరిగుతుందని, అలాగే కర్బనశాతం పెరిగి భూసారం పెరుగుతుందని, వానపాములు వృద్ధిచెందుతాయని తద్వారా అధిక దిగుబడులు సాధించవన్నారు. ఈ నవధాన్య విత్తనాలు కిట్లు ప్రతి రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు అందుబాటులో ఉంటాయని, రైతులందరు ఈ నవధాన్య విత్తనాలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో %వారాా% వెన్నెల, వైస్ ఎంపిపి చప్ప సూర్యనారాయణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు పొలంబడి రైతులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు పశువుల కాపరి మృతి



విశాలాంధ్ర-బెలగాం(పార్వతీపురం మన్యం జిల్లా) : పిడుగుపాటుకు పశువుల కాపరి మృతి చెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే పార్వతీపురం మండలం పెదబొండపల్లి గ్రామానికి చెందిన వంగపండు తాతబాబు(45) శుక్రవారం సాయంత్రం గ్రామ శివారులో గల తామర చెరువు దగ్గరలో పశువులు కాపలా కాస్తుండగా వర్షంతో పాటు పిడుగు పడింది. ఆ సమయంలో తామరచెరువు ప్రక్కనగల బావి ఒడ్డున ఉండగా పిడుగుపాటుకు బావిలో పడిపోయాడు. గమనించిన తోటి పశువుల కాపలా దారులు కుటుంబీకులకు సమాచారాన్నిచ్చి బావి నుండి అతనిని బయటకు తీసి పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి ఆటోలో తీసుకొనిరాగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చ్యురీకి తరలించారు. సమాచారం అందు కున్న వెంటనే ఎమ్మెల్యే అలజంగి జోగారావు పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి కుటుంబీ కులను పరామర్శించి ఓదార్చి మృతదేహానికి శ్రద్ధాంజలి ఘటించి, కుటుంబీకులకు ప్రభుత్వం తరపున అన్నివిధా లా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పార్వతీపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ ఐటిఐ లో మెగా జాబ్ మేళా

విశాలాంధ్ర-సీతంపేట: సీతంపేట ప్రభుత్వ ఐటిఐ లో మెగాజాబ్ మేళ నిర్వహించగా ఐటిడిఏ పీవో కల్పనకుమారి నిరుద్యోగ యువత ఈసదవకాశాన్ని సద్వినియోపరుచుకో వాలని తెలిపారు. 549 మంది ఉద్యోగ ఇంటర్వ్యూలకు పాల్గొనగా 223 మంది, 14 కంపెనీల లో సెలెక్ట్ అయారని తెలిపారు. వీరందరికీ ఉద్యోగభద్రతతో పాటు మంచి జీతభత్యాలు అందించడం జరుగుతుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో బిరామ్ గపాల్ సీఈఐ, యు సాయికుమార్ డిఎస్డిఓ, ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ టీవీ గిరి పాల్గొన్నారు.

కొట్యాడ బంద దురాక్రమణ!

బంద భూమి కబ్జా చేసి ఫాం ల్యాండ్ కు రహదారి నిర్మాణం

కబ్జాకి గురవుతున్నా పట్టించుకోని రెవిన్యూ యంత్రాంగం

విశాలాంధ్ర-సాలూరు రూరల్: గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయానికి జీవాధార మైన చెరువులు,బందలు నేడు కబ్జా చెరలో చిక్కి కుంచించుకు పోతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా అక్కడక్కడ కనుమరుగ వుతున్నాయి. మండలంలో పెదబోరబంద పంచాయతీ పరిధిలోని దేవి బుచ్చింపేట గ్రామ రెవిన్యూ పరిధిలో సర్వే నంబర్ 197-1 లో ఉన్న కొట్యాడ బంద ఆక్రమణకు గురవుతుంది.బంద పై భాగములో భూములను కలిగి ఉన్న ఒక భూస్వామి తన ఫాం ల్యాండ్ కు చేరుకునేందుకు వీలుగా చెరువును కబ్జా చేసి రహదారి నిర్మాణం చేపట్టారు.కబ్జా చేసిన బంద భూమిలో 30 అడుగుల వెడల్పు తో 400 మీటర్ల మేర రహదారి నిర్మాణం చేపట్టారు. ఈ నిర్మాణంతో చెరువు విస్తీర్ణం తగ్గింది.చెరువులో మట్టిని తీసి కట్టను వెడల్పు చేసి భారీ వాహనాలు తన పొలంలోనికి వచ్చిపోయే విధంగా గ్రావెల్ తో రహదారి నిర్మాణం చేపట్టారు.ఈరహదారి సదరు భూస్వామికి తప్ప వేరెవరకి ఉపయో గపడదు. ఇతరులు లోపలకి రాకుండా గేటును ఏర్పాటు చేశారు. అంతేకాకుండా సదరు భూస్వామి సాలూరు-మక్కువ బిటి రోడ్ నకు ఆనుకొని కొట్యాడ బందను కలుపుకొని కంచె నిర్మాణం కూడా చేపట్టారు.దీనితో బందకింద ఆయకట్టు భూమి కలిగిన వారెవరు కొట్యాడ బందకు వెళ్లేందుకు వీలు లేని పరిస్థితి దాపురించింది. చెరువులను,బందలను ధ్వంసం చేస్తూ ఫాం ల్యాండ్ కు రహదారి నిర్మాణం చేపట్టుకున్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.అంతేకాకుండా ఈ కబ్జా వ్యవహారం అంతా స్థానిక రెవిన్యూ సిబ్బంది మరియు బోరబంద పంచాయతీ పరిధిలోని ఓ అధికారపార్టీ నాయకుని అండదండలతోనే జరుగుతందని స్థానికుల నుండి ఆరోపణలు వినిపిస్తున్నాయి.అధికారుల నిర్లక్ష్యం,పాలకుల పట్టింపులేనితనం ఫలితంగా యధేచ్ఛగా ఆక్రమణలు జరుగుతున్నాయి. రెవిన్యూ,నీటిపారుదల శాఖల మధ్య ఉన్న సమన్వయ లోపం ఆక్రమణ దారులకు వరంగా మారడంతో వారు యధేచ్ఛగా కబ్జాలకు పాల్పడుతున్నారు.

దీనిపై స్థానిక తహశీల్దారు రామస్వామి వద్ద ప్రస్తావించగా కబ్జా వ్యవహారం ఇప్పటివరకు తమ దృష్టికి రాలేదన్నారు. దీనిపై సర్వేజరిపి నివేదిక ఇవ్వాలని విఆర్వో, సర్వేయర్ లకు ఆదేశాలు ఇస్తామన్నారు.బంద ఆక్రమణకు గురైనట్టైతే ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటానని తెలిపారు.

జాతీయ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ నకు ఎంపికైన శ్రీయాదేవి

– అభినందించిన బ్యాడ్మింటన్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రఘురాజు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఎస్.కోట మండల కేంద్రం స్పార్టాన్ బాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందుతున్న రామరాజు కుమార్తె చి.శ్రియాదేవి అండర్ 19 స్కూల్ గేమ్స్ జాతీయ బాడ్మింటన్ చాంపియన్ షిప్ నకు సెలెక్ట్ అయిన సందర్భముగా స్పార్టాన్ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ & జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు ఇందుకూరి రఘురాజు చి.శ్రియాదేవిని అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ శ్రమతో మరింతగా సాధన చేసి, జాతీయ క్రీడలలో పాల్గొని ఏకాగ్రతతో ఆడి రాణించాలని కోరారు. జాతీయ క్రీడల్లో ఆడుతున్నపుడు పాటించాల్సిన జాగ్రత్తల గురించి పలు సూచనలు చేసారు. కార్యక్రమంలో ఎస్.కోట సర్పంచ్ జి.సంతోషికుమారి, వార్డు మెంబర్ శ్రీను, ఎస్.కోట సిఐ సింహాద్రినాయుడు, డా.కార్తీక్, శ్రీనివాస్, ఈశ్వరరావు, శంకర్, రాంబాబు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం : ప్రిన్సిపాల్ రావాడ

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని వేపాడ పంచా యితీ శివారు బక్కు నాయుడుపేట గ్రామంలో గల ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తు న్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో విద్యా ర్థుల ప్రవేశానికి అంతర్జాలం ద్వారా ఎంపీసీ, బైపీసీ, ఎంఇసి, సీఈసీ, గ్రూపుల ద్వారా ఉచిత విద్యను పొందగోరు విద్యార్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. ఈ పాఠశాలలో బోధనా మాధ్యమం ఆంగ్లంలో ఉంటుందని, పాఠశాలలో విద్యనభ్యసించుటకు విద్యార్థులు ఎటువంటి ఫీజు అవసరంలేదన్నారు. పాఠశాలలో ప్రవేశం పొందుటకు ప్రభుత్వ లేక గుర్తింపు పొందిన పాఠశాలలో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులే అర్హులన్నారు. దరఖాస్తు చేసే ముందుమరింత సమాచారం కొరకు http://apms.ap.gov.in/apms చూడాలన్నారు.దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఈనెల 22 నుండి జూన్ 7వ తేదీ వరకు నెట్ బ్యాంకింగ్, క్రెడిట్/ డెబిట్ కార్డులను ఉపయోగించి, లేదా గేట్ వే ద్వారా అప్లికేషన్ చెల్లిస్తే వారికి ఒక జనరల్ నెంబర్ కేటా యించబడునని ఆ నెంబరు ఆధారంగా http://apms.ap.gov.inద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.ఓసి,బిసి అలాగే ఈడబ్ల్యూఎస్ కేటగిరీలకు చెందిన విద్యార్థులు రూ.200లు రుసుం చెల్లించాలని అదేవిధంగా ఎస్సీ,ఎస్టీ కేటగిరీలకు చెందిన విద్యార్థులు రూ.150 లు చెల్లించాలన్నారు.ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలు పొందగోరు విద్యార్థులు పదిలో సాధించిన మార్కుల ప్రతిభ ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ఎంపిక జరుగుతుందన్నారు.అలాగే మరిన్ని వివరాల కొరకు పాఠశాల ప్రిన్సిపాల్,జిల్లా విద్యాశాఖ అధికారి లేదా మండల విద్యాశాఖ అధికారిని సంప్రదించాలని పాఠశాల ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు తెలిపారు.

నేత్ర, అవయవదానం ఆవశ్యకతపై అవగాహన

విశాలాంధ్ర-చీపురుపల్లి: మండలంలో పిల్లపేట, రోంఖానవీధిల్లో ప్రజలకు ఉపాధి హామీ కూలీలకు మానవీయత స్వచ్ఛంద సేవాసంస్థ, గోవిందరాజులు ఆధ్వర్యంలో ఉపాధి హామీ వేతనదా రులకు చెరువు పనులు జరుగుతున్న స్థలంలో నేత్ర, అవయవదానం చేయుటలో ఆవశ్యకతపై అవగాహన కల్పించగా మేము కూడా ఈ ఉద్యమం క్రతువులో భాగస్వాములు అవుతామని, మనిషి మరణాంతరం విలువైన అవయవాలు మట్టి పాలు చేయకుండా ఇంకొక 13 జీవితాలులో, వెలుగులు, ఆనందాలు మరియు వారి ఆయుష్షు పెంచుటకు తోడ్పడి, ఈ కార్యక్రమాలు పై అపోహలు వీడి, దీన్ని ఒక సామాజిక బాధ్యతగా తీసుకొని ఈ మహా క్రతువులో భాగ స్వామ్యంయి మా బాధ్యత గా సహకరిస్తామని వాగ్దానం చేసి,120 మంది వరకు గోవిందరాజులుకు తెలియ జేశారు. ఇందులో ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది గ్రామ పెద్దలు కూడా పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

సర్పంచ్ నిరుజోగి వెంకటరావు

విశాలాంధ్ర-వేపాడ: వైసిపి ప్రభుత్వం రైతులకు అండగా ఉండి సబ్సిడీపై రైతుల కు వ్యవసాయ పరికరాలను అందిస్తుందని సింగరాయి గ్రామ సర్పంచ్ నిరుజోగి వెంకటరావు అన్నారు.మండలంలోని సింగరాయి గ్రామ సచివాలయ పరిధిలోని ఆర్.బి.కే కేంద్రం నుండి కష్టమ్ హైరింగ్ సెంటర్ వైఎస్ఆర్ యంత్ర సేవ ద్వారా రాయితీపై రైతుకు పవర్ టిల్లర్ ను అందించడం జరిగిందన్నారు.గ్రామానికి చెందిన రైతు నిరుజోగి ప్రసాద్ తన వాటాగా 10 శాతం డబ్బు చెల్లించగా, ప్రభుత్వం 40 శాతం రాయితీ ఇవ్వగా బ్యాంకులోను 50శాతం అందించగా వ్యవసాయ పరికరం పవర్ టిల్లర్ ను రైతుకు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ కే.కోమలత పాల్గొన్నారు.

రైతుకి రూ.10వేలు ఆర్థిక సాయమందించిన ఎమ్మెల్సీ రఘురాజు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : ఎస్.కోట మండలం బొడ్డవర పంచాయితీ శివారు మరుపల్లి గ్రామంలో గురువారం ఈదురు గాలులతో కూడిన భారీవర్షం పిడుగుపాటు కారణంగా రైతు దేవరి సత్తిబాబుకు చెందిన 17 మేకలు మృత్యువాత పడిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు బాధిత రైతు కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భముగా సంఘటన జరిగిన తీరును, రైతుకు జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పరంగా రైతుకు అందాల్సిన నష్ట పరిహారం త్వరగా అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. తక్షణ సాయం క్రింద తనవంతు రూ.10,000/-లు ఆర్థిక సహాయమును అందజేసారు. ఈ కార్యక్రమంలో, ఎస్.కోట ఎం.పి.పి నంది సోమేశ్వరరావు, స్థానిక నాయకులు మురళీరాజు, దేముడు, సుంకరి బుల్లి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు వందనం

విశాలాంధ్ర-భోగాపురం : గ్రామ, వార్డు వాలంటీర్ల సేవలకు సేవామిత్ర, సేవా రత్న, సేవావజ్ర పురస్కారాల ప్రధానోత్స వం భాగంగా భోగాపురం మండలంలోని ముంజేరు సచివాలయం కార్యాలయంలో వలంటీర్ల వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 22 మంది వాలంటీర్లకు సేవ మిత్ర పురస్కారం అందించారు. ముంజేరు సచివాలయానికి సంబంధించి సేవా మిత్ర పొందిన వాలంటీర్లకు సాలువాతో సత్కరించి సర్టిఫికెట్లు ప్రధానం చేశారు అలాగే సేవామిత్ర పురస్కారం పొందిన వాలెంటీర్లలుకు బహుమతిగా ప్రభుత్వం 10 వేలు రూపాయలు అందించనుంది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉప్పాడ అనూష రెడ్డి, వైస్సార్సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, ఎంపీడీఓ దాసరి బంగారయ్య, సర్పంచ్ పూడి నూకరాజు, పిడుగు రాంబాబు, వైస్ సర్పంచ్, వార్డు మెంబెర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

24 నుండి ఇంటర్ అడ్వాన్సు సప్లిమెంటరీ పరీక్షలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఈ నెల 24 నుండి ఇంటర్ అడ్వాన్సు సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని డి.ఆర్ .ఓ గణపతి రావు తెలిపారు. అందుకు సంబంధించి ఏర్పాట్ల పై అయన ఛాంబర్ లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. థియరీ పరీక్షలు ఈ నెల 24 నుండి జూన్ 1 వరకు ఉదయం 9 గంటల నుండి 12 వరకు మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుండి 5.30 వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలు జూన్ 5 నుండి 9 వరకు ఉదయం 9 గంటల నుండి 12 వరకు మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2.00 నుండి 5.00 వరకు జరుగుతాయని అన్నారు. పోలీస్ బందోబస్త్ పటిష్టంగా ఏర్పాటు చేయాలని, పరీక్షా సమయాల్లో ఆర్.టి.సి బస్సు లను పరీక్షా వేళల్లో విద్యార్దులకు సౌకర్యంగా ఉండేలా నడపాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ వారు ఏ.ఎన్.ఎం తో పాటు ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్ లను, ప్రధమ చికిత్సా శిబిరాన్ని పరీక్షల కేంద్రాల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. మాల్ ప్రాక్టీసు జరగకుండా క్షున్నంగా తనిఖీలు చేయాలన్నారు. ఈ సమావేశం లో ఆర్.టి.సి , పోలీస్, విద్యా శాఖ, ఆర్.ఐ.ఓ, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకం

డిఐఒ డాక్టర్ జగన్మోహన్ రావు

విశాలాంధ్ర-గరుగుబిల్లి: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవడం ఎంతో ఆవశ్య కమని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహన్ రావు అన్నారు. ఈ మేరకు ఆయన గరుగుబిల్లి మండలం చినగుడబ, పెదగుడబ, ఎస్ఆర్ పేట గ్రామాలను శుక్రవారం సందర్శించి డ్రైడే కార్యక్రమాలను పర్యవేక్షించారు. కాలువల్లో, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తపడాలని లేకపోతే అవి దోమల వ్యాప్తికి అనుకూలి స్తాయని తద్వారా మలేరియా, డెంగ్యూ, వైరల్ జ్వరాలకు మొదలగు సీజనల్ వ్యాధులకు గురవుతామని అన్నారు. ఇటువంటి హై రిస్క్ ప్రదేశాలను గుర్తించి తగు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఆయన పర్యవేక్షణలో సిబ్బంది కాలువల్లో దోమల నివారణ మందును పిచికారి చేశారు. గ్రామాల్లో జ్వర నిర్ధారణ పరీక్షలు, మందులు అందుబాటులో ఉంచాలని, సీజనల్ వ్యాధులపై ఎప్పటికప్పుడు సిబ్బంది అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డిఐఒ జగన్మోహనరావు ప్రజలకు పై అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎం. దుర్గాప్రసాద్, డిపిహెచ్ఎన్ఓ ఉషారాణి, సూపర్ వైజర్లు విజయకుమారి, శర్మ, జయగౌడ్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీ కామాక్షి అమ్మవారి ఆలయ చతుర్థి వార్షికోత్సవం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : స్థానిక బొండాడవీధిలో 130 సంవత్స రాల క్రితం వెలసిన శ్రీ మహాగణపతి, కామాక్షి సమేత ఏకాంబరేశ్వర స్వామి వారి దేవాలయం పునః నిర్మాణం చేసి 4వ వార్షికోత్సవం జరుపుకుంటున్నట్లు ఆలయ పాలకమండలి అధ్యక్షులు సోమరాజు విలేఖర్ల సమావేశంలో తెలిపారు. ఆలయ వార్షికోత్సవం స్వస్తిశ్రీ చాంద్రమానేన శోభకృత్ నామ సంవత్సర జ్యేష్ఠ శుద్ధ సప్తమి అనగా మే 26 వ తేదీ శుక్రవారంనిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆరోజు ఉదయం 6.00 గంటల నుండి అమ్మవారికి పంచామృత అభిషేకములు, గణపతిపూజ, భూపుర శ్రీ చక్ర అలంకరణ, దేవి దేవతా మూర్తుల హవణం 9.00 గంటలకు మూలమూర్తులకు ప్రత్యేక వస్త్ర ఆభరణ అలంకరణ, ఉదయం 10.00 గంటలకు సువాసినిలతో శ్రీచక్ర సహస్ర కుంకుమార్చన,సాయంత్రం 5.00 గంటల నుండి 6.00 గంటలవరకు లలితాపారాయణ మరియు హరేశ్రీనివాస్ బృందం ఇంకుల పద్మ,ఇమ్మిడిశెట్టి దీప వారిచే కోలాట కార్యక్రమం 6.00 గంటల నుండిశివపార్వతుల కళ్యాణం అనంతరం వేద ఆశీర్వచనములు, రాత్రి 8.30 గంటలకు పంచహరతులు బ్రహ్మశ్రీ లక్కోజు ఓంకారాచారి సిద్ధాంతి, బ్రహ్మశ్రీ పేరుమళ్ల మణికంఠశాస్త్రి సిద్ధాంతి శిష్యు బృందం వారిచే, దేవాలయ అర్చకులు బ్రహ్మశ్రీ అండలూరి గంగాధరాచారి, బ్రహ్మశ్రీ కాకినాడ వెంకట రమణ సిద్ధాంతి, అర్చకత్వంన జరుగునని తెలియజేసారు. ఆలయవార్షికోత్సవము సందర్భంగా అమ్మవారికి భక్తులు సమర్పించిన 108 చీరలుతో అలంకరణ చేయబడునని చెప్పారు.. ఈ కార్యక్రమమునకు భక్తులెల్లరు పాల్గొని జయప్రదం చేసి అమ్మవారి కృపకు పాత్రలు కావలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాలను పరిశీలించిన వ్యవసాయ అధికారి

విశాలాంధ్ర-పాచిపెంట: మండలం లోని గురువు నాయుడుపేట నాందేడ్ వలస మాతుమూరు రైతు భరోసా కేంద్రాలను వ్యవసాయ అధికారి కే తిరుపతిరావు శుక్రవారం పరిశీలించారు ముందుగా రైతు భరోసా కేంద్రాలలో పిఎం కిసాన్ అర్హుల జాబితాలను పరిశీలించి నమోదు కార్యక్రమం జరుగుతున్న విధానాన్ని తనిఖీ చేశారు. అర్హులైన అందరి రైతులకు ఈ కేవైసీ చేయించాలని గ్రామ వ్యవసాయ సహాయకులను ఆదేశించారు. అనంతరం ప్రాథమిక సమాచారం పొలంబడి ఎరువులు మరియు విత్తనాల పంపిణీ రిజిస్టర్లు ఈక్రాపు నమోదు విధానం తనిఖీ చేశారు. అందరూ గ్రామ వ్యవసాయ సహాయకులు రైతు భరోసా కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని కియోస్క్ టీవీ లైబ్రరీ పుస్తకాలు అన్నింటిని రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. మొక్కజొన్న కొనుగోలుకు సిద్ధంగా ఉన్న రైతులందరికీ తేమశాతం పరీక్షలు జరిగేటట్టు చూడాలని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు మొక్కజొన్నను ఇవ్వడానికి సంసిద్ధంగా ఉన్న రైతులు అందరికీ మద్దతు ధర దక్కేటట్లు చూడాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలో అందుబాటులో ఉన్న రైతులతో గ్రామాలకు కావలసిన ఎరువులు. విత్తనాల వివరాలను గురించి ఆరా తీశారు రైతు భరోసా కేంద్రాలలో ఉన్న ఎరువుల నిల్వలను పరిశీలించి ఎరువుల కొరత లేకుండా ఉండేటట్లు ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు అనిల్ కుమార్ గణేష్ మరియు దినేష్ కుమార్ పాల్గొన్నారు.

మినీ గోకులాల బిల్లులు తక్షణమే చెల్లించండి

ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ డిమాండ్

విశాలాంధ్ర-వేపాడ: రైతులు నిర్మించుకున్న మినీ గోకులాలకు నాలుగేళ్లు పూర్తి కావస్తున్న బిల్లులు చెల్లించకపోవడం రైతులకు అన్యాయం చేయడమే అన్నారు. మినీ గోకులాలు నిర్మించండని చెప్పిన అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గానీ, నేటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గాని సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో రైతులను అన్యాయం చేయడమేనని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్ అన్నారు. ఈ మేరకు రైతులతో కలిసి వేపాడ ఎంపీడీఓ కు వినతిపత్రం అందించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పులు చేసి షెడ్ లు నిర్మించిన రైతులు గగ్గోలు పెడుతున్నారని, ఏడాది క్రితం కొంత మెర బిల్లులు చెల్లించి అధికారులు ఊరుకున్నారు. రైతుల ఆందోళన నేపథ్యంలో గతంలో నిర్మించే గోకులాలకు ఈనెల 30 లోపు నిర్మించిన షెడ్ల స్థితిని పరిశీలించి పేమెంట్లు ఇవ్వండని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నా కింద స్థాయి అధికారులు మాత్రం గోకులాల బిల్లులు పట్టించుకోలేదు. అప్పటి పశు వైద్యాధికారులు చెప్పిన విధంగా కొలతలతో మెటీరియల్ వాడి సెడ్లు నిర్మించారు. 6 పశువుల చెడ్డకు 1.8 లక్షలు,4 పశువుల చెడ్డకు 1.2 లక్షలు బిల్లులు ఇస్తామని రైతులతో చెప్పి షెడ్లు నిర్మించేటట్టు చేశారు. కానీ ఎంతో ఉత్సవంతో పశువుల రక్షణ కోసం సొంత పెట్టుబడితో షెడ్లు నిర్మించిన రైతులకు అప్పులు బాధలే మిగిలాయని రైతులు గగ్గోలు పెడుతున్నారని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు పర్యవేక్షించి పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించకపోతే మండల జిల్లా స్థాయిలో ఉద్యమం నిర్మిస్తామని రైతు సంఘం నాయకులు చల్లా జగన్, మిడతన పరదేశి నాయుడు హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు వర్రి అప్పలనాయుడు, ముమ్ములూరి సాయి, గొల్లు చంద్రరావు, కిలపర్తి సత్తిబాబు, గొల్లు ఎర్రన్న, రొంగలి రామమరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కమ్యూనిస్టు ఉద్యమ నేత కామ్రేడ్ సుందరయ్య 38వ వర్ధంతి వేడుకలు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : దక్షిణ భారత దేశ కమ్యూనిస్టు ఉద్యమనేత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి వేడుకలను శృంగవరపు కోట మండలం, కొత్తూరు గ్రామంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడు తూ భారతదేశంలో ఏదైతే శ్రమ దోపిడీకి గురవుతు న్న శ్రమజీవుల విముక్తి కోసం, బానిస సంకెళ్ల విముక్తి కోసం, తినేవాడికి భూమి కోసం తానే ముందుండి సుందరయ్య పోరుబాట నడిపించారని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ భూ పోరాటంలో ముందుండి లక్షల ఎకరాలు ప్రభుత్వ భూములను, రజాకర్ల భూములను పేదలకు పంపిణీ చేసిన మహానీయుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అన్నారు. ఈ మహానీయుడు నెల్లూరు జిల్లా అలగానపాడులో భూస్వామ్య కుటుంబంలో జన్మించారు. ఈయనకు ఉన్నటువంటి యావదాస్తిని పేదలకు పంచిపెట్టిన మహనీయుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య. తన ఆస్తే ఈ ప్రజలుగా భావించి.. ఈ ప్రజలే తన పిల్లలుగా భావించి తన జీవితాన్నే త్యాగం చేసినటువంటి సుందరయ్య జీవితం ధన్యమని అన్నారు. కామ్రేడ్ సుందరయ్య విద్యార్థి దశలోనే దేశ స్వతంత్ర పోరాటంలో పాల్గొన్నారని, కుల వివక్షకు వ్యతిరేకంగా, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా తన ఇంటి నుండే మొదలుపెట్టిన మహానేత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఈ మహానీయుడు పార్లమెంటు సభ్యుడుగా ఎన్నికైతే ఎటువంటి సెక్యూరిటీ గాని ప్రభుత్వ వాహనం గాని వాడుకున్న సైకిల్ పై పార్లమెంటుకి వెళ్ళిన మహనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య అని గుర్తు చేశారు. ప్రతి రూపాయి కూడా వృథా కాకుండా ఉండాలని చెప్పినటువంటి మహానేత ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయ రాదని చాటి చెప్పిన గొప్ప నాయకుడు సుందరయ్య. ఇటువంటి నాయకులు ఎంత వెతికినా చట్టసభల్లో కాన రాలేదు. నేడు చట్టసభల్లో వ్యక్తిగత స్వార్థాల కోసం, కుల రాజకీయాల కోసం, మత రాజకీయాల కోసం ప్రజాదనాన్ని దోచుకుందాం అనుకున్న వాళు ,, నేరచరిత్ర ఉన్నవాళ్లు, ఆర్థిక నేరగాళ్లు నేడు చట్టసభల్లోకి వెళ్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నేడు కేంద్రంలో ఆర్ఎస్ఎస్, బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వ సంస్థలను, ప్రభుత్వ ఆస్తులను నింగి నేల అనే తేడా లేకుండా విదేశీ, స్వదేశీ కార్పొరేట్ శక్తులకు అమ్మేస్తుందని ఆరోపించారు. కార్మిక హక్కులను కాలరాస్తుంది. దేశానికి అన్నం పెట్టే రైతన్నను సర్వ నాశనం చేస్తున్నదని మద్దిల రమణ వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జరతా గౌరీష్, చేలికాని ముత్యాలు, ఎం.శివ, జి.సత్యనారాయణ, జి.యుదు, ఎం.అప్పలసూరి, కె.దేవుళ్ళు, సాయి తదితరులు పాల్గొన్నారు.

రూపురేఖలు మారిన తహశీల్దార్ కార్యాలయం

ఒకప్పుడు డంపింగ్‌యార్డులా ఉన్న దాన్ని... ఎమ్మార్వో చొరవతో ఆహ్లాదకర వాతావరణంలో...

విశాలాంధ్ర-సాలూరు టౌన్ : డంపింగ్ యార్డ్ గా ఉన్న తహశీల్దార్ కార్యాలయాన్ని ఒక సమాజం పట్ల ఒక అవగాహన ఉన్న ఎమ్మార్వో వచ్చి ఒక ఆహ్లాదకరంగా, పచ్చగా ఒక్క పార్కు వలె తీర్చిదిద్దారు.వివరాల్లోకి వెళ్తే సాలూరు పట్టణం రెవిన్యూ కార్యాలయం,ఉప ఖజానా కార్యాలయం, రిజిస్టర్ కార్యాలయం, రూరల్ పోలీస్ స్టేషన్, సివిల్ సప్లై గోడౌన్, పుట్టి ఎన్నో సంవత్సరాలు కావస్తున్నది. చాలామంది అధికారులు సిబ్బంది మారుతూ ఉన్న ఏ రోజు ఎమ్మార్వో కార్యాలయం మార్పుకు నోచుకోలేదు.సాలూరు పట్టణ తహసిల్దార్ కార్యాలయం ఎన్నో ఏళ్ల నుంచి అక్కడే చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, స్థానిక ప్రజలు వాహనాల నిలుపుట, అక్కడే పాన్ వంటివి ఆ కార్యాలయం ముందు జరుగుతున్నవి. అయితే 2022 సంవత్సరంలో కోరాడ శ్రీనివాసరావు తహశీల్దారు వారు కొత్తవలస నుంచి సాలూరు కు బదిలీ పై వచ్చారు. ఈయనకు సమాజం పట్ల, ప్రజల పట్ల ఒక సామాజిక మార్పు తేవాలని ఎంతో ఆసక్తికరంగా ఉండేవారు. కోరాడ శ్రీనివాసరావు ఆయన రెవిన్యూ సిబ్బందితో కలిసి ముందుగా గ్రామాల నుంచి వచ్చిన వాహనాలను స్థానిక వాహనాలను నిలపకుండా, మరియు పాన్ అక్కడ చేయకుండా ఆపారు,ఆ తరువాత కార్యాలయాన్ని అలాగే కార్యాలయం ముందు పచ్చగా గడ్డిని నాటి, పచ్చని చెట్లు నాటి, చుట్టుపక్క గ్రామం నుంచి వచ్చే వారి కోసం మర్రిచెట్టు చుట్టూ గట్టుకట్టించారు. కార్యాలయం ముందు పాతబడిపోయిన గేటును తీసి కొందరి సహాయంతో కొత్త గేటును వేయించారు.ఆ చుట్టుపక్కల ఎల్ఈడి లైట్లు పెట్టించారు. అలాగే లోపల కార్యాలయం కూడా ఎక్కడ ఉండవలసిన అక్కడ ఉండేలాగా చేశారు. ఆహ్లాదకరమైన వాతావరణానికి శ్రీకారం చుట్టి కార్యాలయం రూపురేఖలను మార్చారు.. ఈ విధంగా కొత్తవలస లో కూడా తాహశీల్దార్ కార్యాలయాన్ని అభివృద్ధి చేశారు..అయితే కోరాడ శ్రీనివాసరావు కు ఇంతలోగా సాలూరు నుంచి భోగాపురం బదిలీ అయ్యారు.సాలూరు కు రామస్వామి తహశీల్దారు నియమితులయ్యారు. ఆ వెంటనే ఆయనకి అక్కడున్న బాధ్యతలు అప్పగించి మీరు ఇక్కడ ఇదే వాతావరణం మీ సిబ్బంది సహాయ సహకారాలు తీసుకొని కొనసాగాలని మీరు దీనికి కొంచెం కృషి చేయాలని ఆయనకి అప్పగించి వెళ్లడం జరిగింది.ఆయన బదిలీపై వెళ్లిన వెంటనే అభివృద్ధికి నోచుకోలేదు ఎలా ఉండేదో అదే విధంగా ఇక్కడే వాహనాలు పార్కింగ్, రోడ్లపై పెట్టే పళ్ళు బండి, మరిము పాన్ కి అక్కడే వెళ్తున్నారు. ఇప్పుడు డంపియాడ్ లాగా ఉన్నది. ఎక్కడ మొదలైందో అక్కడకే మళ్లీ వచ్చి చేరుకుంది. ఎమ్మార్వో రామస్వామి కార్యాలయం అభివృద్ధి విషయంలో పక్కన పెడితే ఈయన చుట్టుపక్క గ్రామాల ప్రజలకు కాకుండా, స్థానిక ప్రజలకు,రాజకీయ నాయకులకు, కూడా ఆయన ఎమ్మార్వోల కనిపించట్లేదు. ప్రజలు ఎవరైనా ఆయన వద్దకు వస్తే కనీసం తల ఎత్తి కూడా మాట్లాడటం లేదు. వాళ్ళ సమస్య కూడా వినడం లేదు.ఈ విధంగా ఉంటే సాలూరు ప్రజలకు చేయవలసిన పనులన్నీ వెనక పడిపోతాయి. ఒక ఎమ్మార్వో ఈ విధంగా ఉంటే మండలం కనిపించకుండా పోతుంది.కావున ఆయన సిబ్బందితో కలిసి కార్యాలయాన్ని, మండలాన్ని, అభివృద్ధి చేయాలని స్థానిక ప్రజలు, గ్రామీణ ప్రజలు,రాజకీయ నాయకులు కోరుతున్నారు.

నైతిక విలువలతో జీవించాలి

విశాలాంధ్ర-విజయనగరం క్రైమ్: ప్రతి ఒక్కరూ నైతిక విలువలతో కూడిన జీవితాన్ని కలిగి ఉండాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కోరారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ విజయనగరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎం. ఆర్. కళాశాల విద్యార్థుల ఇంటర్నషిఫ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు నైతిక విలువలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు నాలుగు ఎన్ల రాజు, కె. వెంకటరమణ ప్రస్తుతం సమాజంలో ప్రతి వ్యక్తి పాటించావాల్సిన నైతిక విలువల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ గౌరి శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

జి.అగ్రహారంలో గడప గడపకూ మన ప్రభుత్వం

విశాలాంధ్ర-చీపురుపల్లి: చీపురు పల్లిలోని జి.అగ్రహారంలో గడప గడపకి మన ప్రభుత్వం అనే కార్యక్రమంలో విజయనగరం జిల్లా వైసీపీ యువజన నాయకులు బెల్లాన వంశీకృష్ణ శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనతో పాటూ చీపురుపల్లి పంచాయతీ జి.అగ్రహారం లో గడపగడపకి మన ప్రభుత్వం అనే కార్యక్రమంలో మండల వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ నాయకులు ఇప్పిలి అనంతం, మండల పార్టీ అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనువాస నాయుడు జిల్లా టెలికాం బోర్డ్ సభ్యులు ఇప్పిలి తిరుమల,రైల్వే బోర్డ్ సభ్యులు తాడేలా ఉమ, ఎంపీటీసీ గెరిడ రామదాసు, కోసిరెడ్డి రమణ,వార్డు మెంబర్లు తలసీట్ల రాము,బురాడ మహేష్, రౌతు పైడిరాజు, కోసిరెడ్డి సంతోష్, పందు తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య ఆశయాలకు కృషి చేయాలి

విశాలాంధ్ర-సాలూరు టౌన్ : దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టుల పార్టీ నిర్మించి, కష్టజీవుల ఆశాజ్యోతిగా స్థిరస్థాయిగా పుచ్చలపల్లి సుందరయ్య నిలిచారు అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి మున్సిపల్ కార్యాలయంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యుడు టి వెంకటరావు అధ్యక్షతన ఆయన చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సిపిఎం నాయుడు మాట్లాడుతూ కష్ట జీవులు ఆశా జ్యోతి సుందరయ్య ఆయన జీవితం పేదలు కోసం అంకితంచేసి నికరంగా ప్రజాసమస్యలు పై రాజీలేని పోరాటం చేసారని తెలిపారు. సుందరయ్య చూపిన బాటలో నడవాలని కోరారు. భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపుఇచ్చారు.

సుందరయ్య ఆశయసాధనే లక్ష్యం కావాలి

విశాలాంధ్ర-కురుపాం: పుచ్చల పల్లి సుందరయ్య వర్ధంతి నీ పురస్కరించుకొని మండల కేంద్రంలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల వద్ద శుక్రవారం సిపిఎం పార్టీ నాయకులు ఎం. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సుందరయ్య తన జీవితాంతం దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం చేశారని పీడిత ప్రజానీకం తరఫున నిలబడ్డారని వ్యవసాయ కూలీల సమస్యలపై పోరాటం ప్రారంభించి వ్యవసాయ సంఘాన్ని స్థాపించారని ఆ సంఘమే దేశవ్యాప్తంగా ఈరోజు ఉపాదిహామీ చట్టాన్ని తీసుకురావడానికి కారణం అయిందని అన్నారు.అలాగే గిరిజన ప్రాంతంలో ఉన్న గిరిజన హక్కులని చట్టాలను వెనక్కి లాక్కుంటున్నారని జీవో నెంబర్ 3ని రద్దుచేసి గిరిజన ప్రాంతంలో యువతీ యువకులకు తీవ్ర అన్యాయం చేశారని 1/70 చట్టాన్ని ఎత్తివేసి మైనింగ్ పేరుతో గిరిజనలు సాగు చేస్తున్న భూములను కొండలని అన్నిటిని కార్పొరేట్ పెట్టుబడుదారులకు అప్పజెప్పడానికి మోడీ ప్రభుత్వం చూస్తుందని వీటన్నిటికీ వ్యతిరేకంగా ప్రజలంతా సుందరయ్య స్ఫూర్తితో పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పి. తిరుపతిరావు, రామారావు, యుటిఎఫ్ మండల కార్యదర్శి టి. శ్రీరాములు గిరిజనులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేటి నుండి వాలంటీర్లకు సన్మాన కార్యక్రమం

విశాలాంధ్ర-దత్తిరాజేరు : నేటినుండి మొదలై వచ్చే నెల 14వ తేదీ వరకు మండలంలో ఉన్నటువంటి అన్ని సచివాలయ వాలంటీర్లకు వారి పనితీరు ఆధారంగా మూడు కేటగిరిలో ఎంపికైన వాలంటీర్ లకు గ్రామ సచివాలయంలో ఎంపిపి గేదెల సింహాద్రి అప్పలనాయుడు చేతుల మీదుగా సేవా వజ్ర-ఇద్దరకి, సేవా రత్న ఐదుగురికి ,సేవా మిత్ర రెండు వందల అరవైమందికి సత్కార కార్యక్రమమును గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న వాలంటీర్లకు సన్మాన కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలియజేశారు. సేవా వజ్ర ద్వారా ఎంపికైన వాలంటీర్లకు 30 వేలు నగదు, సత్కారం, సేవా రత్న ద్వారా ఎంపికైన వాలంటీర్లకు 20 వేలు నగదు, సత్కారం, సేవా మిత్ర ద్వారా ఎంపికైన వాలంటీర్లకు 10 వేలు నగదు, సత్కారం అందజేయడం జరుగుతుందని తెలియజేసారు.

వివిధ సిలబస్ పై వేసవి శిక్షణ తరగతులు

విశాలాంధ్ర-సాలూరు టౌన్ : వికాస తరంగిణి వారు వివిధ సిలబస్ పై వేసవి తరగతులను నిర్వహిస్తున్నా మని వికాస తరంగణి విశ్వనాథం రామానుజ దాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా విశ్వనాథం మాట్లాడుతూ సాలూరు పట్టణంలో శ్రీ సత్యసాయి మందిరం లో 5వ తరగతి నుంచి 9 వ తరగతి తరగతి వరకు వారు వేసవి తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు 48 వరకు వస్తున్నారు. అలాగే విలువలు,రామాయణం, మాథ్స్, సైన్స్, ఇంగ్లీష్ అత్యంత ప్రతిభా వంతులైన ఉపద్యులుచే నేర్పిస్తున్నామని అన్నారు .కొన్నిపోటిలు నిర్వహిస్తూ బహుమతులను బహుకరిస్తూ ప్రోత్సహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో గొట్టాపు శ్రీనివాస్,కిషోర్, సూర్యకుమారి, శశి మాస్టర్, రామమూర్తి, రాంబాబు లెసన్స్ రవ్వా ప్రియ, పాల్గొన్నారు.

జిల్లా అదనపు ఎస్పీగా అస్మా ఫర్హీన్

విశాలాంధ్ర-విజయనగరం క్రైమ్: కృష్ణా జిల్లా సెబ్ అదనపు ఎస్పీగా పని చేస్తున్న అస్మా ఫర్హీన్ ను జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) గా నియమిస్తూ రాష్ట్ర హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్ కుమార్ గుప్తా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సెబ్ అదనపు ఎస్పీ గా అదనపు బాధ్యతలు నిర్వహించవలసిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాలో %బాజుదీ% అదనపు ఎస్పీగా కృష్ణా జిల్లా నుండి అటాచ్మెంట్ పై ఆమె పని చేస్తున్నారు.2012లో పోలీసుశాఖ లో డైరెక్ట్ డిఎస్పీ గా ఎంపికైన అస్మా ఫర్హీన్ రాజమండ్రి, విజయనగరం పోలీసు శిక్షణ కళాశాలలో డిఎస్పీ హోదాలో పని చేశారు. అదనపు ఎస్పీగా ఉద్యోగ ఉన్నతిని పొంది కృష్ణా, విజయనగరం జిల్లాల్లో %బాజుదీ% అదనపు ఎస్పీగా సమర్థవంతంగా పని చేసి, మద్యం అక్రమ రవాణకు కళ్లెం వేయడంతో పాటు, విద్యార్థులు, ప్రజలు మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టారు.

ఎస్ కోటలో చంద్రబాబు రోడ్ షో సక్సెస్

జనసమీకరణలో పట్టు బిగించిన కోళ్ల

సత్తాచాటలేకపోయినటిడీపీ నేత గొంప

ఊగిసలాటలో నియోజకవర్గ టీడీపీ శ్రేణులు

విశాలాంధ్ర-వేపాడ : నియోజకవర్గ కేంద్రం ఎస్ కోటలో గురువారం రాత్రి బాదుడే బాదుడు, రాష్ట్రానికి ఇదేమి ఖర్మ కార్యక్రమాలు పురస్కరించుకొని నిర్వహించిన టీడీపీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రోడ్ షో సక్సెస్ దిశగా నడిచింది. ఎస్ కోట నియోజకవర్గ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అధ్యక్షతన జరిగిన ఈ రోడ్ షోలో మాజీ ఎమ్మెల్యే కోళ్లలలితకుమారి టీడీపీ నేత శ్రీధర్ తో పాటు గొంప కృష్ణ కూడా వేదికను పంచుకున్నారు.కాగా ఎస్ కోట ఎమ్మెల్యే టికెట్ కోసం కోళ్ళ లలితకుమారి, ఎన్నారై గొంప కృష్ణల మధ్య పోటీ నెలకొనడంతో చంద్రబాబు సభను సక్సెస్ చేసేందుకు జన సమీకరణ కోసం ఎవరికి వారే వారి వారి శక్తి యుక్తులను గట్టిగా ఒడ్డారు.ఎస్ కోట, ఉత్తరాపల్లి నియోజకవర్గాలలో 60ఏళ్ళ గా రాజకీయం నెరిపిన కోళ్ల కుటుంబానికి ప్రజల్లో మంచి పేరున్న సంగతి అందరికీ తెలిసిందే.ఈ 60ఏళ్లలో మాజీ మంత్రి స్వర్గీయ కోళ్ళ అప్పలనాయుడు 8సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందగా ఒకసారి మాత్రమే ఓటమి పాలయ్యారు. అలాగే కోళ్ళ అప్పలనాయుడు కోడలు, మనుమరాలైన కోళ్ళ లలితకుమారి 2 సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందగా ఒకసారి మాత్రం ఓటమిపాలయ్యారు.ఈ రెండు నియోజకవర్గాలలో సుమారు 50ఏళ్లపాటు చక్రం తిప్పిన కోళ్ళ కుటుంబీకులు అవకాశం ఉంటే ఉపకారం చేయడమే తప్ప అపకారం చేసిన దాఖలాలు లేవు.అందువల్లే ప్రజల్లో మంచి వ్యక్తులుగానే ముద్ర ఉంది తప్ప పెద్దగా చెడు లేదనే ప్రచారం ఉంది. అయితే గత అసెంబ్లీ ఎన్నికలప్పుడు పార్టీ ఆదేశాలను విస్మరించారన్న ప్రచారం వల్ల కొంత మంది టీడీపీ అగ్రనేతల తెరవెనుక రాజకీయం కారణంగా ఎన్నారై గొంప కృష్ణను తెరమీదకు తీసుకు వచ్చినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది.ఈ నేపథ్యంలో గొంప కృష్ణ అధిష్ఠానం ఆదేశాల మేరకు నేరుగా మాజీ ఎమ్మెల్యే కోళ్లను కలవాల్సి ఉండగా ఫోన్లో (అంతర్గతంగా) సంభాషించాల్సి చూడడం,నియోజకవర్గంలోని కొంత మంది టీడీపీ నేతలను కలుపుకొని కోళ్ళపై తిరుగుబావుటా ఎగురవేయడంతో ఎస్ కోట టీడీపీ కోటకు కాస్త పగుళ్ళు ఏర్పడ్డాయి.ఈ పరిస్థితిలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు పర్యటన ఖరారు కావడంతో వారిద్దరికీ ఎమ్మెల్యే టికెట్ కోసం యుద్ధం తప్పలేదు.దాంతో సభకు జనసమీకరణ అనివార్యం కాగా కోళ్ల కుటుంబం,వారి వర్గీయులు సర్వశక్తులు ఒడ్డాల్సి వచ్చింది. ఈ మేరకు నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి కోళ్ళ అభిమానులు పార్టీ శ్రేణులు సభకు అనం ఖ్యాకంగా తరలిరాగా చంద్రబాబు ఉబ్బితబ్బిబ్బయ్యారు. అయితే ఎన్నారై గొంప కృష్ణ కూడా జనసమీకరణకు నడుం బిగించినప్పటికీ ఆశించినంతమంది వచ్చారా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ విషయమై నియోజకవర్గంలో కూడా జోరుగా చర్చ జరుగుతోంది. అలాగే సభావేదికపై కోళ్ళకే సముచితస్థానం లభించగా గొంపకు ఎటువంటి ప్రాధాన్యత కూడా లభించక పోవడంతో పార్టీ శ్రేణులు సందిగ్ధంలో పడ్డారు. అలాగే శుక్రవారం జరిగిన సమీక్షలో కూడా గొంపకు అవకాశం కల్పించారా లేదా అన్నది బయటకు వస్తే టికెట్ ఎవరికి ఇస్తారో తేలిపోతుందని పార్టీ అగ్రనాయకులు ముచ్చటించుకుంటున్నారు.

సమయ పాలన లేని విద్యుత్ కోతలు తగ్గించాలి

వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన

విశాలాంధ్ర-బొబ్బిలి: విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించటం విద్యుత్ శాఖ అధికారులు తీవ్రంగా విఫలం చెందారని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, సిపిఐ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్, సిపిఐ నాయకులు వెంపలి బాబ్జి ల సిపిఎం నాయకులు పి శంకర్రావు, రైతుకూలీ సంఘం నాయకులు వెలగాడ కృష్ణ, బీఎస్పీ నాయకులు సోరు సాంబయ్య, నాయకుల ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ మరియు మండలంలో విద్యుత్ వినియోగదారులకు సరిపడినంతగా విద్యుత్తు సరఫరా అందించడం లేదని సమయపాలన లేకుండా విద్యుత్ కోతలు విధించడంతో సామాన్య మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బం దులు పడుతు న్నారని అన్నారు. పట్టణంలో 40 వేల విద్యుత్ మీటర్లు ఉండగా విద్యుత్ సరఫరాకు సరిపడినంతగా విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం వాళ్ళ డిమాండ్ తో కూడిన వినతి పత్రాన్ని విద్యుత్ శాఖ పట్టణ ఏఈ కి వినతి పత్రం అందజేశారు. పదిరోజుల్లోగా విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ లు మార్పులు చేసి వినియోగదారులకు అవసరమైన విద్యుత్తును సరఫరా చేయాలని లేని యెడల విద్యుత్ శాఖ కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని హెచ్చరించారు.

నాణ్యతకు బ్రాండ్ మలబార్ గోల్డ్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: నమ్మకం, పారదర్శకత, నాణ్యత కు ప్రసిద్ధి పొందిన బ్రాండ్ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ వినియోగదారులకు అత్యుత్తమ విలువలు గల ఆభరణాలు అందించడంలోముందుంటోందని షోరూం మేనేజర్ పి.సురేష్ తెలిపారు.శుక్రవారంపట్టణంలో రైల్వే స్టేషన్ దరి మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూం వధువులు, మహిళలు ఆభరణాలుఅలంకరణ ప్రదర్శన జరిగింది. పాల్గొన్నారు. ఈసందర్భంగా నిర్వాహకులు సురేష్ మాట్లాడుతూ గత మూడు వేళ్ళుగా దేశంలోని పలు ప్రాంతాల లో వినియోగదారులకు అనుగుణంగా ఆభరణాలు అందుబాటులో ఉంచుతున్నారు.

పుస్తక పఠనం మరియు పేపర్ క్రాఫ్ట్

విశాలాంధ్ర-తెర్లాం: తెర్లాం శాఖ గ్రంథాలయం లో శుక్రవారం వేసవి శిక్షణ సందర్భంగా స్థానిక జెడ్పీహెచ్ స్కూల్ టీచర్ కే.ఉమా మహేశ్వరి టీచర్ చదవడం మాకిష్టం అనే రీతిలో పిల్లలకు నైతిక విలువలు పెంచే పుస్తకాలు, నీతి కథలు, పంచతంత్ర కథలు, చందమామ కథలు మరియు వివేకశీలం , గురజాడ అప్పారావు మేదలగు సంస్కర్తలు గురించి ఆమె పిల్లలకు బోధించారు.మరియు స్థానిక జెడ్పీ హెచ్ స్కూల్ క్రాఫ్ట్ టీచర్ కే.విష్ణు మాట్లాడుతూ విద్యార్థులకు బొమ్మలను చిత్రీకరించి ,గీసిన వాటిని కలర్స్ తో రంగులు ఏ విధంగా వేయాలి అని తెలియజేసారు.కలర్ పేపర్లు తో పువ్వులు అందమైన బొమ్మలు కూడా విద్యార్థులు చే ఎలా వేయాలో అని నేర్పించడం జరిగింది .16 మంది విద్యార్థులు పాల్గొన్నారు అని స్థానిక గ్రంథాలయ అధికారి సి హెచ్ కృష్ణ మూర్తి తెలిపారు.

చంద్రబాబును కలిసిన చిరంజీవులు

విశాలాంధ్ర, పార్వతీపురం: మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ప్రతిపక్షనేత నారా చంద్ర బాబు నాయుడును పార్వతీపురం నియోజక వర్గం ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు శుక్రవారంనాడు ఎస్ కోట నియోజక వర్గంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్ కోట నియోజక వర్గంలో ఇదేం కర్మ కార్యక్రమం చంద్ర బాబు నాయుడు ఆధ్వర్యాన జర్గగా, అక్కడకు వెళ్లి కలిసిన చిరంజీవులు నియోజకవర్గంలోని పార్టీపరిస్థితి గుర్చి వివరించారు. రానున్న ఎన్నికల్లో అంతా కలిసికట్టుగా పనిచేసి పార్వతీపురం నియోజక వర్గంలో టీడీపీని గెలుపించడానికి పనిచేయాలని చంద్ర బాబునాయుడు ఆదేశించారు. ఆయనతో పాటు జిల్లాపార్టీ అధ్యక్షురాలు గుమ్మిడి సంధ్యారాణి ఉన్నారు.

నవధాన్య విత్తనాల కిట్లు పంపిణీ

విశాలాంధ్ర-మక్కువ: మండలంలోని చప్పబుచ్చింపేట రైతు భరోసా కేంద్రంలో శుక్రవారంనాడు నవధాన్య విత్తనాలు కిట్లు పంపిణీ చేశారు. "నవధాన్యాలు సాగు నేలతల్లికి బాగు" అనేకార్యక్రమంలో భాగంగా ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రణాళికలు షణ్ముఖరావు, ఆదనపుజిల్లా ప్రణాళికలు ధనుంజయరావు సూచనల మేరకు మక్కువయూనిట్ ఇంచార్జ్లు నలితంగంగరాజు, ఉర్లక నాగార్జునలు పాలించి రైతులకు నవధాన్య విత్తనాల కిట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈనవధాన్యాలు సాగుచేయడం వల్ల భూమిలో జీవవైవిధ్యం పెరుగుతుందని, అలాగే కర్బన శాతం పెరిగి భూసారం పెరుగుతుందని, వానపాములు వృద్ధి చెందుతాయని తద్వారా అధిక దిగుబడలు సాధించవచ్చన్నారు. నవధాన్య విత్తనాల కిట్లు ప్రతి రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు అందుబాటులో ఉంటాయని, రైతులందరు ఈ నవధాన్య విత్తనాల వేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం సాగుద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధ్యమని తెలిపారు. రైతులు ప్రకృతి వ్యవసాయ సాగుపై అవగాహన పెంచుకోవాలని కోరారు. నేటి వ్యవస్థలో ప్రకృతి వ్యవసాయ పంటలకు అధిక డిమాండు ఉందన్నారు. కార్యక్రమంలోసైన్ ఎంపీపీ చప్ప సూర్యనారాయణ, సచివాలయం వ్యవసాయ సహాయకులు వెన్నెల,ప్రకృతి వ్యవసాయసిబ్బంది, పాలంజి రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ అధికారులు పర్యవేక్షణ లోపంపై చర్యలు చేపట్టాలి

కాంగ్రెస్ పార్టీ నాయకులు మొగల్ శ్రీనివాసరావు

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణంలో విద్యుత్ శాఖ సిబ్బందిపై సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేయడంలో తీవ్రంగా విఫలం చెందడంతో విద్యుత్తు వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు మువ్వల శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో అనేక చోట్ల ఈ డిజిటల్ మీటర్ల యొక్క డిస్ప్లే పాడైపోయి, మీటర్లు పనిచేయకపోయినప్పటికీ విద్యుత్ వినియోగదారులకి ప్రతి నెల బిల్లులు మాత్రం ఇస్తున్నారని, ఇది ఏ ప్రాతిపదిక మీద బిల్లులు ఇస్తున్నారో వినియోగదారులకు సమాధానం చెప్పాలని విద్యుత్ శాఖ అధికారులు ప్రశ్నించారు. ఈ ప్రభుత్వంలో విద్యుత్ వినియోగదారులను ఇదో రకమైన దోపిడి చేస్తుందని పనిచేయని మీటర్లు, డిస్ప్లే పోయిన మీటర్లు ఉన్నా మీరు పట్టించుకోకపోవడం లేదని దీని కారణం సంబంధిత విద్యుత్ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం అని స్పష్టంగా తెలుస్తుందని అన్నారు. దీనిపై సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో విజయనగరం, విశాఖపట్నంలో ఉన్న ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

అందాల పోటీల్లో సత్తా చాటిన విజయనగరం అమ్మాయి

అభినందించిన శాసనసభ ఉపసభాపతి కోలగట్ల

విశాలాంధ్ర -విజయనగరం టౌన్ : ఈ నెల 15న హైదరాబాద్ వేదికగా ఓ సంస్థ వారు నిర్వహించిన అందాల పోటీల్లో విజయనగరానికి చెందిన ఎం.వాణి మిస్ ఆంధ్రప్రదేశ్ గా నిలిచింది. ఈ సందర్భంగా ఏపీ శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్ర స్వామిని విజయనగరంలోని ఆయన నివాసం వద్ద మర్యాద పూర్వకంగా ఆమె కలిశారు. ఈ పోటీల్లో మొత్తం 300 మంది పాల్గొనగా.. వివిధ విభాగాల్లో సత్తా చాటు తాను విజేతగా నిలిచినట్లు వివరించారు. అనంతరం కోలగట్ల ఆమెను అభినందిస్తూ.. మన ప్రాంత యువత నేడు అన్నిరంగాలలోనూ విజేతలుగా నిలవడం గర్వకారణం అన్నారు. యువతరానికి ప్రోత్సాహం అందిస్తున్నామని, ఇదే స్ఫూర్తితో మున్ముందు మరిన్ని విజయాలు సాధించాలని పిలుపునిచ్చారు.

అనారోగ్య కారణాలతో వివాహిత ఆత్మహత్య

విశాలాంధ్ర-శృంగవరపుకోట : మండలంలోని ఎస్.కోట తలారి గ్రామంలో అల్లు పార్వతి(25) అనే వివాహిత అనారోగ్య కారణాలతో శుక్రవారం కన్నవారి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈమె తల్లిదండ్రులు ఎస్.కోట తలారి గ్రామానికి చెందిన వారు కాగా వివాహిత భర్త స్వగ్రామం ఇదే మండలంలోని పెదఖండేపల్లి గ్రామం. మృతురాలి తండ్రి మిడతాన అప్పలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ జె.తారకేశ్వరరావు వెల్లడించారు.

ఉద్యాన నర్సరీని పరిశీలించిన ఐటిడిఏ పీవో కల్పనా కుమారి

విశాలాంధ్ర -సీతంపేట: సీతంపేట ఐటిడిఏ పరిధి లోగల తురాయిపువలస ఉద్యాన నర్సరీని ఐటిడిఏ పీవో కల్పన కుమారి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీలో ఉన్న మొక్కలను పరిశీలించారు. నర్సరీ అభివృద్ధికి పూర్తి ప్రణాళిక తయారు చేసి ఇవ్వాలని హార్టికల్చర్ సిబ్బందికి సూచించారు. మొక్కలను అంటు కట్టే పద్ధతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సబ్ అసిస్టెంట్ కాంతారావు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు జరిగే ఏపీ ఆర్ ఎస్ పరీక్షలపై అవగాహన

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ నేడు జరిగే ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్ కు సంబంధించిన అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో లింగేశ్వర రెడ్డి సూపరింటెండెంట్, డిపార్ట్మెంట్ అధికారులకు వివరాలను వెల్లడించారు. ఇంటర్ డిగ్రీ ఆరవ తరగతికి సంబంధించి ఈ పరీక్షలను నిర్వహిస్తారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని ఆదేశించారు.

ఉపాధి పనులు పరిశీలించిన ఎపిఓ

విశాలాంధ్ర -రేగిడి : వంగరపేట గ్రామంలో ఉపాధి హామీ పథకం మట్టి రోడ్డు పనులను ఏపీఓ సంకరాపు హరినాథ్ పరిశీలించారు. వాసల్లో 201 మంది వేతనదారులు మస్టర్స్ తనిఖీ చేశారు. వేతనదారులతో మాట్లాడుతూ రెండు పూటలా పనిచేయాలని, కొలతలు ప్రకారం పనిచేసినట్లు అయితే 272 రూపాయలు వస్తుందని తెలిపారు. ఎండలు తీవ్రంగా ఉన్నాయని పనులు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో, ఎఫ్ఎ మంగమ్మ, మేట్లు, వేతనదారులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లతో పలు అంశాలపై సమీక్ష

విశాలాంధ్ర-తెర్లాం: మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ ఫీల్డ్ మరియు టెక్నికల్ అసిస్టెంట్లతో శుక్రవారం సమీక్షను నిర్వహించిన ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ. ఈ సందర్భంగా ఆధార్ నవీకరణ, పనిదినాల కల్పన, బిల్లుల చెల్లింపులు, పనుల నిర్వహణ కొలతలు, క్షేత్రస్థాయి పర్యటనలు, గనుల వేతనం, ఎమ్.బుక్ నిర్వహణ, వేతన మరియు పనుల చెల్లింపులు తదితర అంశాలపై సమీక్షను నిర్వహించి ఎంపీడీఓ మాట్లాడుతూ గతంలో చెప్పిన ప్రకారం ప్రతీ వేతనదారునికి ఆధార్ నవీకరణ చేయమని చెప్పడం జరిగిందని ఇంకా కొన్ని పెండింగ్ వున్నవని అలాంటి వారికి డిమాండును కల్పించిన చెల్లింపులలో సమస్య వస్తుంది కావున అటువంటి వారికి ఆధార్ నవీకరణ ప్రక్రియ ఈ-సేవ, బ్యాంకులు వద్దకు వెళ్లి చేసుకునేలా చర్యలు చేపట్టాలని తదుపరి వారికి డిమాండు కల్పించాలని, డిమాండును కల్పించి చిన ప్రతి వేతనదారుడు పనికి సమయానికి వచ్చి అప్పగించిన కొలతలు పూర్తిచేసేకోనేట్లు చూడాలని క్షేత్ర సహాయకులకు ఆదేశించారు. మరియు టెక్నికల్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయి పర్యటనలో పనులు జరుగుతున్న ప్రాంతాలను పరిశీలన చేసి వేతనదారుల యొక్క హాజరును, అప్పగించిన కొలతలు పూర్తి చేస్తున్నారా? లేదా? పరిశీలన చెయ్యాలని, కొత్త పనులను గుర్తించి తదుపరి చర్యలకు ఆమోదం తీసుకోవాలని, ప్రతీ వేతనదారునికి సగటు వేతనము పొందడానికి ఎంత పని నిర్దేశించబడుతుందో తెలియజేసి ఆపని పూర్తి అయ్యేటట్లు చూసే బాధ్యత క్షేత్రసహాయకులు క్రమంగా చూస్తున్నారా? లేదా? పరిశీలన చెయ్యాలని, చెల్లింపుల ఎప్పటికి అప్పుడు పూర్తిచేయాలని, ఎం.బుక్ లు సక్రమంగా నిర్వహించాలని, మరియు చెల్లింపుల నకలులో ఆన్లైన్ నందు అప్లోడ్ చేయాలని కంప్యూటర్ ఆపరేటర్లకు ఆదేశించారు. మరియు పనుల పురోగతిని ఎప్పటికి అప్పుడు సమీక్షించాలని అదనపు కార్యక్రమ అధికారికి సూచించారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు నగరం సన్నద్ధం



విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : మూడు రోజులపాటు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు నగరం సన్నద్ధమవుతోంది. రాజీవ్ క్రీడా ప్రాంగణంలో ఈనెల 20, 21 తేదీలలో కబడ్డీ పోటీలు, 21 22 తేదీలలో కస్పా హైస్కూల్లో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు జరుగనున్నాయి. ఇందుకోసం జిల్లా కబడ్డీ అసోసియేషన్ మరియు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సంయుక్త నిర్వహణలో సర్వం సిద్ధమవుతోంది. క్రీడాకారుల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం పోటీలు నిర్వహించేందుకు సన్నాహాలు పెద్ద ఎత్తున చేస్తున్నారు. తొలిసారిగా మెట్లు ఏర్పాటు చేసి వాటిపై పోటీలు నిర్వహిస్తున్నారు. క్రీడాకారులకు అవసరమైన సదుపాయాలను కల్పించడంతోపాటు భోజన సౌకర్యాలను సమకూర్చుతున్నారు. ఈ మేరకు శుక్రవారం రాజీవ్ క్రీడా ప్రాంగణంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్, డివిఈవో సురేష్ కుమార్ సంయుక్త పత్రికా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ కౌశిక్ మాట్లాడుతూ ఈనెల 20,21 తేదీలలో రాష్ట్రస్థాయి అండర్ 19 బాల బాలికల కబడ్డీ పోటీలు రాజీవ్ క్రీడ ప్రాంగణం మైదానంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే 21, 22 తేదీలలో స్థానిక కస్పా హైస్కూల్లో అండర్ 19 బాలబాలికల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలను రాష్ట్ర విద్యాశాఖ మాత్యులు బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రారంభించనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల నుండి సుమారు 400 మంది బాలబాలికలు కబడ్డీ పోటీలకు, 400 మంది బాలబాలికలు ఖోఖో పోటీలకు హాజరుకానున్నారని తెలిపారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సమకూర్చడంతో పాటు క్రీడాకారులకు భోజన సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. డి వి ఈ ఓ సురేష్ కుమార్ మాట్లాడుతూ మూడు రోజులపాటు రాష్ట్రస్థాయిలో జరుగనున్న క్రీడా పోటీలను విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఢిల్లీలో జరుగునున్న జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ తరఫున ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కాళ్ళ సూరిబాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాడంగి గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులను వినియోగించుకుంటున్న విద్యార్థులు

విశాలాంధ్ర -తెర్లాం/బాడంగి: బాడంగి గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి ఆర్. దుర్గా ప్రసాద్ అధ్యక్షతలో వేసవి శిక్షణ తరగతులు తేదీ: 08-05-2023 నుండి 11-06-2023 వరకు మొత్తం 35రోజులు పాటు వివిధ అంశాలపై క్లాసులు నిర్వహించడం జరుగుతుంది. భాగంగా శుక్రవారం (12వరోజు) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సంధ్య మేడమ్ వారితో పాటు పిల్లలకు ఇంకా బాగా పేపర్ క్రాఫ్ట్ నేర్పించాలి అనే తపనతో తన కుటుంబ సభ్యురాలైన సోదరి గౌతమి మేడమ్ కూడా వచ్చి పిల్లలకు చాలా సులభంగా అర్థమయ్యే రీతిలో పేపర్ క్రాఫ్ట్ లో భాగంగా పేపర్ తో గ్రీటింగ్ కార్డ్ ఎలా వివరంగా తయారు చేసి చూపించడం జరిగింది. అదేవిధంగా పిల్లలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సంధ్య మేడమ్ పిల్లలకు ఇంగ్లీష్ గ్రామర్ ను ఏవిధంగా సులభంగా నేర్చుకోవాలి అనే అంశంపై బోధించడం పిల్లలలో వారి వారికి టీమ్ లీడర్ పెట్టడం వలన ఇదిన పిల్లలకు వాళ్ళ ద్వారా చెప్పించడం దీని వలన ఇప్పట్నించే పిల్లలలో తమ తోటి పిల్లలకు బోధించే స్కిల్స్ పెంపొందించుకోవచ్చు అని చెప్పారు. పిండంగి వలస ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవిబాబు పిల్లలకు మానవత విలువలకు సంబంధించి స్కూల్స్, ఇంట్లో తమ తల్లితండ్రులతో పిల్లలు ఏవిధంగా నడుచుకోవాలి అనే అంశాలపై బోధించడం జరిగింది. వీటితో పాటుగా బాడంగి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు రహీమ్ మాస్టర్ చిన్న పిల్లలకు కథలు చదివించడం భారతి టీచర్ ఆట పాటలు ఆడించడం జరిగింది. బాడంగి గ్రంథాలయ అధికారి రొంగలి దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ శుక్రవారం గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ తరగతులకు పిల్లలు రోజు వచ్చిన సంఖ్య సుమారు 80మంది వినియోగించుకుంటున్నారు అని తెలుపుతూ ఇదే విధంగా పిల్లలు అందరూ బాడంగి గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలి అని కోరారు.

చాగంటి ని సత్కరించటం మరచిపోలేని అనుభూతి

రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు



విశాలాంధ్ర-బొబ్బిలి: ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు గారి ని కలిసి సత్కరించటం మరచిపోలేని గొప్ప అనుభూతిని మిగిల్చినదని రోటరీ క్లబ్ అధ్యక్షులు జె సి రాజు అన్నారు శుక్రవారం ఆయన రోటరీ క్లబ్ ప్రతినిధులు తూముల కార్తిక్, ఎస్ శ్రీనివాస్, శ్రీ హరి, ఎం శ్రీనివాసరావు లతో కలసి స్థానిక టివిఆర్ కన్వెన్షన్ లో చాగంటి వారిని కలిసి పట్టు కండువాతో సత్కరించిరోటరీ ఆధ్వర్యంలో బొబ్బిలి వీణపై రూపొందించిన ప్రత్యేక కవర్ ఆల్బమ్ ను అందించి బొబ్బిలి వీణ ప్రాముఖ్యతను ఆయనకు తెలియచేసారు. రోటరీ చేస్తున్న సేవా కార్యక్రమాలను తెలియచేసారు.వారి ఆశీస్సులు ను అందు కున్నారు. చాగంటి వారిని కలిసి వారిని సత్కరించే సదావకాశాన్ని రోటరీ కి కల్పించిన బొబ్బిలి రాయలవారు బేబీ నాయన, రోటరీ సర్వీస్ ప్రాజెక్ట్ చైర్మన్ గెంబలి శ్రీనివాసరావు లకు రోటరీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలియచేసారు.

22 నుండి ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిరసన



విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఈనెల 22 నుండి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించబోయే నిరసన కార్యక్ర మాల వివరాలను శుక్రవారం జిల్లా ఎస్పీ ఎం దీపిక కు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏపిజి ఈఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి రామచంద్రరావు, కంది వెంకటరమణలు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఉద్యోగులకు వ్యవహరిస్తున్న తీరు సరైనది కాదన్నారు. పాదయాత్రలో జగన్మోహన్ రెడ్డి ఉద్యోగులకు ఇచ్చిన రాజకీయ హామీలన్ని వెంటనే నెరవేర్చా లన్నారు. ముఖ్యంగా సిపిఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిలో భాగంగా ఈనెల 22 నుండి 31 వరకు నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అప్పటికి ప్రభుత్వం స్పందించకుంటే రానున్న కాలంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామ న్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బాబాఖ్సర్ తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లు సేవలు అభినందనీయం : ఎమ్మెల్యే శంబంగి

విశాలాంధ్ర-బొబ్బిలి: మండలం పారాది గ్రామంలో నిర్వహించిన వాలంటీర్లకు సత్కార కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని ఉత్తమ సేవాలందించిన వాలంటీర్లకు ఆయన చేతులు మీదుగా సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర,అవార్డులను అందజేసి దుశ్శాలువతో వాలంటీర్లును సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి వేణుగోపాలనాయుడు,జెడ్పీటీసీ సంకిలి శాంతకుమారి,సర్పంచ్ ప్రతినిధి ఉత్తరావల్లి ధనంజయ,ఎంపీటీసీ అల్లాడ ఉమ, ఉప సర్పంచ్ బొంగు నాగభూషణ, మండల జెసిఎస్ కన్వీనర్ తమ్మిరెడ్డి దామోదర్,వైసిపి నాయకులు ఉత్తరావల్లి అప్పలనాయుడు,కనిమెరక సత్యం,అల్లాడ నగేష్ కుమార్, ప్రభుత్వ అధికారులు,వాలంటీర్లు,తదితరులు పాల్గొన్నారు.

బైకు అదుపుతప్పి ముగ్గురికి గాయాలు

విశాలాంధ్ర -రేగిడి: వంగర మండలం అరసాడ దగ్గర బైకు అదుపు తప్పడంతో ముగ్గురు యువకులకు గాయాలు పాలయ్యారు. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం అరసాడ గ్రామానికి చెందిన సాయికుమార్, చందు, ఇంకొక స్నేహితుడు ముగ్గురూ బైక్ పై వెళ్తుండగా అరసాడ కోళ్ల ఫారం దగ్గర బైక్ అదుపుతప్పి కింద పడిపోయారు. సాయికుమార్ తీవ్ర గాయాలయ్యాయి. మిగతా వారికి స్వల్ప గాయాలు కాగా108 సిబ్బంది విశ్వనాథం ప్రథమ చికిత్స చేసి రాజాం ఆస్పత్రికి తరలించారు.

మన్యం జిల్లా ప్రచార కమిటీ కన్వీనర్ గా గొర్లె జగన్ మోహన్ రావు

విశాలాంధ్ర-సాలూరు టౌన్ : మన్యం జిల్లా ప్రచార కమిటీ కన్వీనర్ గా గొర్లె జగన్ మోహన్ రావు ను నియమించినట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు తెలిపారు.ఈ సందర్భంగా అప్పలనాయుడు ఆధ్వర్యంలో కౌన్సిలర్లు వైసీపీ నాయకులు జగన్మోహన్ రావును ఘనంగా సన్మానించారు. ఈ అనంతరం సన్మాన గ్రహీత గొర్లె జగన్మోహనరావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా జగన్ ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నారని గతంలో పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం నవరత్నాలు తో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేశారు అని అన్నారు. జిల్లా ప్రచార కమిటీ బాధ్యతలు తనకు అప్పగించినందుకు రాష్ట్ర దొరకు, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతగా ఉంటానని, జగన్మోహన్ రెడ్డి ని గెలిపించుకునేందుకు మరోసారి ఈమె ముఖ్యమంత్రిగా రాజన్నదొరను గెలిపించుకుంటానని ప్రచార కమిటీ కన్వీనర్ గా నా వంతుగా కృషి చేస్తానని తెలియజేశారు.అందుకు ప్రతి ఒక్క కార్యకర్తలు, నాయకులు,సహాయ సహకారాలు అందించాలని అన్నారు. కౌన్సిలర్లు నాయకులు సాలువతో కన్వీనర్ ను సన్మానించారు. కౌన్సిలర్లు వర్రిప్రసాద్, సింగారపు ఈశ్వరరావు, బాలకృష్ణ, కర్రి అప్పలస్వామి,తాడి శంకరరావు, కొల్లి రమణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జోగమ్మపేటలో కాలువలు పరిశుభ్రత

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని జోగమ్మ పేట గ్రామంలో కాలువలను, రోడ్లను శుభ్రం చేస్తున్నట్లు సర్పంచ్ కె.సింహాచలం తెలిపారు. గ్రామాల ప్రజలు కూడా సహకరించి ఇళ్ళ ముందు చెత్త చెదారాన్ని తొలగించి దూరంగా వేయాలని కోరారు. గ్రామాన్ని ఎల్లప్పుడూ పరిశు భ్రంగా ఉంచుదామని తెలిపారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి కిరణ్,పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు తప్పనిసరిగా ఈకేవైసి చేయించుకోవాలి

విశాలాంధ్ర - తెర్లాం/బాడంగి: మండలంలో గల రైతులందరు 14వ విడత పీఎం కిసాన్ లబ్ది పొందాలంటే తప్పనిసరిగా ఈకేవైసి చేయించుకోవాలని, భూమికి ఆధార్ (ల్యాండ్ సీడింగ్)చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కే. శిరీష తెలిపారు.ఖరీఫ్ 2023 కి సంబంధించి కౌలు రైతులు గా గ్రామ రెవెన్యూ అధికారి వద్ద నమోదు చేసుకొని కౌలు కార్డ్ లు పొంది రైతు భరోసా కేంద్ర సిబ్బంది ని సంప్రదించి కౌలు రైతులు గా రిజిస్టర్ చేపించుకోవాలని కోరారు. పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్ర సిబ్బంది ని కలిసి రిజిస్ట్రేషన్ లు %ంపేమెంట్ చేసి విత్తనాలు పొందాలని తెలిపారు.